మన మీ.. వార్త
ప్రతి అక్షరం... ప్రజల కోసం
TGBIL/25/A0512
ఖమ్మం
భద్రాద్రి కొత్తగూడెం
శనివారం
14 నవంబర్ 2026
పేజీలు : 6
@mvaartanews
www.mivaartanews.com

పేదవారి సంక్షేమమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం అడుగులు.





- రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి.

- నేలకొండపల్లిలో లబ్ధిదారులకు క్రొత్త చేయూత పింఛన్ల మంజూరు ఆర్డర్లను పంపిణీ చేసిన మంత్రి.

నేలకొండపల్లి నవంబర్ 13 మీ వార్త ప్రతినిధి:

పేదవాని సంక్షేమమే ధ్యేయంగా ప్రజాప్రభుత్వం అడుగులు వేస్తుందని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం మంత్రి, నేలకొండపల్లి మార్కెట్ యార్డులో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో నేలకొండపల్లి మండలంలో నూతనంగా మంజూరైన చేయూత పెన్షన్ మంజూరు పత్రాలను లబ్ధిదారులకు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ తో కలిసి అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, సుమారు 7-8 సంవత్సరాల నుంచి భర్తలను కోల్పోయి, తీవ్ర ఇబ్బందులు పడుతున్న ఆడబిడ్డల బాధలను గతంలో గ్రామాల్లో నేరుగా వారి ఇంటికి వెళ్లినప్పుడు ప్రత్యక్షంగా చూశామని, వారి మనసులోని వేదనను స్వయంగా పంచుకున్నామని తెలిపారు. కేవలం ఆడబిడ్డలే కాకుండా, వికలాంగులు, గీత కార్మికులు, నేత కార్మికులు ఇలా వందలాది మంది పడిన వేదనను ఈ ప్రజా ప్రభుత్వం స్వయంగా చూసిందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదవాళ్లకు అండగా నిలవాలనే ఉద్దేశంతో అనేక సంక్షేమ కార్యక్రమాలు అందిస్తున్నామని తెలిపారు. అందులో భాగంగానే అర్హులైన ప్రతి పేదవాడికి పింఛన్ అందించాలనే లక్ష్యంతో మొన్న దీపావళి పండుగ రోజున రాష్ట్రవ్యాప్తంగా 4.5 లక్షల మందికి పైగా అర్హులకు పింఛన్లు అందజేసే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. గత 7,8 సంవత్సరాలుగా కాళ్లు అరిగేలా ఆఫీసుల చుట్టూ తిరిగిన మహిళలకు దీపావళి నాడు వారి ఇంట్లోనే శుభవార్త చెప్పడం జరిగిందని తెలిపారు. పాలేరు నియోజకవర్గంలోని నేలకొండపల్లి మండలంలో క్రొత్తగా 1,138 మందికి ఆసరా పింఛన్లు అందజేయడం జరుగుతోందన్నారు. ఈ మండలానికి గతంతో కలుపుకొని ప్రతి నెలా రూ. ఒక కోటి 82 లక్షలు ప్రజా ప్రభుత్వం ద్వారా నేరుగా పంపిణీ చేస్తున్నామన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఎంత బాగాలేకపోయినా, పేదవాళ్ల వద్దకు, ఆడబిడ్డల వద్దకు, వికలాంగులు, గీత, చేనేత కార్మికుల వద్దకు ఒక్క అడుగు కూడా వెనకడుగు వేయకుండా పూర్తి భరోసా కల్పించడమే ఈ ప్రభుత్వ ప్రధాన ఆలోచన అని మంత్రి స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో దేశంలోనే ఎక్కడా లేనివిధంగా పెద్దోళ్లు తినే సన్నబియ్యాన్ని ఇకపై పేదోళ్లందరూ తినాలనే ఉద్దేశంతో ప్రభుత్వం సన్న బియ్యం పథకాన్ని అమలు చేస్తోందన్నారు. కొత్త రేషన్ కార్డుల కోసం 7 సంవత్సరాలు ఎదురుచూసిన వారికి, కొత్త కోడళ్లు లేదా కొత్త సభ్యులు చేరిన కుటుంబాలకు ప్రజా ప్రభుత్వం రాగానే కొత్త రేషన్ కార్డులు మంజూరు చేశామని తెలిపారు.గతంలో హామీ ఇచ్చిన విధంగా 200 యూనిట్ల ఉచిత కరెంట్, ఆడబిడ్డలు ఆర్టీసీ బస్సులో ఎంత దూర ప్రయాణం చేసినా ఉచిత బస్సు సౌకర్యాన్ని విజయవంతంగా కల్పిస్తున్నామని తెలిపారు. మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో రూ. 73 వేల కోట్ల రూపాయలను సున్నా వడ్డీ కింద ఇస్తున్నామని, ఇందులో భాగంగానే మహిళలకు పెట్రోల్ బంకులు, రైస్ మిల్లులు కూడా ఆర్థికాభివృద్ధికి పూర్తి మద్దతుగా నిలుస్తున్నామని మంత్రి అన్నారు.రైతును రాజును చేస్తామన్న మాటకు కట్టుబడి రూ. 2 లక్షల వరకు రుణమాఫీ చేశామని, ఎకరానికి రూ. 12 వేలు రెండు విడతలుగా రైతు భరోసా అందించే కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. సన్న వడ్లకు మద్దతు ధరతో పాటు క్వింటాలుకు అదనంగా రూ. 500 బోనస్ ఇచ్చే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. రైతన్నలకు మొదటి పంటకు ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలుతీసుకున్నామన్నారు.కాళేశ్వరం కడితే లక్ష కోట్లు కమీషన్ వస్తుంది కాని, పేదోడికి ఇళ్లు ఇస్తే కమీషన్ రాదన్న దుర్బుద్ధితో గత పాలకులు వ్యవహరించారని, కానీ ఈ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే మొదటి విడతలో రాష్ట్రవ్యాప్తంగా 4.5 లక్షల ఇళ్లు, రెండో విడతలో 2.5 లక్షల ఇళ్లు మంజూరు చేసిందని, అలాగే హైదరాబాదులో ఒక లక్ష ఇళ్లు, మొత్తం 8 లక్షల ఇళ్లు రూ. 40 వేల కోట్లతో పేద ఆడబిడ్డలకు ఇస్తున్నామని తెలిపారు. రాజకీయ పార్టీలు, కుల మతాలకతీతంగా పింక్ షర్టు వేసుకుని వచ్చినా, అర్హులైన ప్రతి పేద మహిళకు ఇల్లు కట్టించి ఇచ్చే బాధ్యత పూర్తిగా ప్రభుత్వానిదేనని మంత్రి స్పష్టం చేశారు. చేయూత పింఛనుల కోసం ఎవరైనా అర్హులు మండలానికి ఒకరిద్దరు మిగిలిపోయి ఉంటే, వారిని కూడా విస్మరించకుండా త్వరలోనే న్యాయం చేస్తామని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో కె. శ్రీరామ్, హౌజింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, నేలకొండపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, ఎంపిడిఓ ఎర్రయ్య, తహసీల్దార్ రాంప్రసాద్, మండలంలోని పలు గ్రామాల సర్పంచులు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం.





- తల్లాడ మండలంలో చేయూత పెన్షన్ మంజూరు పత్రాల పంపిణీ చేసిన ఎంపీ రఘురాం రెడ్డి, ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్.

సత్తుపల్లి నవంబర్ 13 మీ వార్త ఆర్.సి:

పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. సత్తుపల్లి నియోజకవర్గంలోని తల్లాడ మండల పరిధిలో జి.ఎన్.ఆర్ గార్డెన్స్‌లో శుక్రవారం నిర్వహించిన చేయూత పెన్షన్ మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డితో కలిసి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ పాల్గొని లబ్ధిదారులకు పెన్షన్ మంజూరు పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఒంటరి మహిళలు, వితంతువులు, దివ్యాంగులు, చేనేత కార్మికులు, గీత కార్మికులకు మంజూరైన పెన్షన్ పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వం సంవత్సరాల తరబడి కొత్త పెన్షన్లు మంజూరు చేయకుండా అర్హులైన పేదలను ఇబ్బందులకు గురిచేసిందని విమర్శించారు. పెన్షన్ల కోసం ఎదురుచూస్తున్న పేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగుల కష్టాలను గుర్తించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం అర్హులకు సంక్షేమ పథకాలను అందించేందుకు కట్టుబడి ఉందని తెలిపారు. కొత్తగా పెన్షన్లు మంజూరైన లబ్ధిదారుల తరఫున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇళ్ల పథకం, రైతులకు రుణమాఫీ, రైతు భరోసా, సన్నధాన్యానికి బోనస్, ఇందిరా మహిళా శక్తి ద్వారా స్వయం ఉపాధి అవకాశాలు, వడ్డీలేని రుణాలు, ఆరోగ్యశ్రీద్వారా ఉచిత వైద్య సేవలు, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా ఆర్థిక సహాయం, ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా వైద్య చికిత్సకు ఆర్థిక తోడ్పాటు వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని వివరించారు.ఖమ్మం జిల్లాకు చెందిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సత్తుపల్లి నియోజకవర్గ అభివృద్ధికి విశేషంగా సహకరిస్తున్నారని పేర్కొంటూ, వారికి ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందించేందుకు కృషి చేస్తోందన్నారు. పెన్షన్లు కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదని, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు ఆత్మగౌరవంతో జీవించేందుకు అందించే భరోసా అని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతోందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సహాయం అందేలా ప్రజాప్రతినిధులు నిరంతరం కృషి చేస్తారని హామీ ఇచ్చారు.

నారాయణ పాఠశాలలో ఘనంగా డ్రెస్ కాంపిటీషన్.





ఖమ్మం నవంబర్ 13 మీ వార్త ప్రతినిధి:

ఖమ్మం నారాయణ పాఠశాలలో విద్యార్థులకు డ్రెస్ కాంపిటీషన్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు వివిధ రకాల ఆకర్షణీయమైన వేషధారణలతో పాల్గొని అందరినీ ఆకట్టుకున్నారు. తమ ప్రతిభను, సృజనాత్మకతను చక్కగా ప్రదర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, సృజనాత్మకత, వేదికపై మాట్లాడే నైపుణ్యాలను పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని పాఠశాల ప్రిన్సిపాల్ జి. నవీన్ కుమార్ యాదవ్ తెలిపారు. విద్యార్థుల ప్రదర్శనలను ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆత్మీయ ఆహ్వానంప్రమాణ స్వీకార మహోత్సవానికి హృదయపూర్వక ఆహ్వానం.

సత్తుపల్లి నవంబర్ 13 మీ వార్త ఆర్ సి:



మన ప్రియతములు చల్లగుళ్ల నరసింహారావు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి గ్రామంలోని పెద్దలు, యువకులు, సోదరులు, మిత్రులు, అభిమానులు అందరూ అధిక సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తున్నాము. ఈ శుభ సందర్భంలో మీ అమూల్యమైన సమయాన్ని కేటాయించి, కార్యక్రమానికి విచ్చేసి నరసింహారావు ఆశీర్వదించి, మీ అభిమానాన్ని, ఆప్యాయతను తెలియజేయాలని సాదరంగా కోరుకుంటున్నాము.
మీ అందరి రాకతో ఈ వేడుక మరింత వైభవంగా, ఆనందోత్సాహాలతో జరగాలని ఆకాంక్షిస్తున్నాము.

మట్టి టిప్పర్లపై ఆర్టీవో పంజా..

- అనుమతులు లేకుంటే చర్యలు తప్పవు.

- కల్లూరు పట్టణంలో తనిఖీలు.. జక్కా పేరుతో ఉన్న టిప్పర్‌పై కేసు నమోదు.

సత్తుపల్లి నవంబర్ 13 మీ వార్త అర్ సి:



కల్లూరు పట్టణంలోని పుల్లయ్య బంజర్ రోడ్డులో ఆర్టీవో రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జక్కా పేరుతో ఉన్న మట్టి టిప్పర్‌ను పరిశీలించగా, సరైన అనుమతులు లేవని గుర్తించి కేసు నమోదు చేసినట్లు సమాచారం. అనుమతులు లేకుండా మట్టి రవాణా చేసే టిప్పర్లపై ఆర్టీవో అధికారులు కొరడా ఝళిపిస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించే వాహనదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరిస్తున్నారు.

జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్వర్ణోత్సవాల ముందస్తు సన్నాహక సమావేశం.



సత్తుపల్లి నవంబర్ 13 మీ వార్త టౌన్ రిపోర్టర్: స్థానిక జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల 1976లో స్థాపించబడి 50 వసంతలోకి అడిగిడిన సందర్భంగా, డిసెంబర్ నెలలో స్వర్ణోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. గోపి తెలిపారు. ఈ స్వర్ణోత్సవాల నిర్వహణకు సంబంధించిన అంశాలను చర్చించేందుకు ఈ నెల 15 అనగా ఆదివారం ఉదయం 10 గంటలకు కళాశాల ప్రాంగణంలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన ఒక ప్రకటనలో వెల్లడించారు.ఈ సమావేశానికి కళాశాలలో గతంలో విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులందరూ తప్పనిసరిగా హాజరై, స్వర్ణోత్సవాల నిర్వహణకు సంబంధించి తమ విలువైన సూచనలు, సలహాలు అందించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కల్లూరుకు హైడ్రా రావాలి చెరువులు, కుంటలను కాపాడాలి.

- రేపటి భవిష్యత్తు కోసం జలవనరులను రక్షించండి.
- ఎర్రబంజర్ మాజీ సర్పంచ్ జమలయ్య డిమాండ్.
- ఎర్రబంజర్‌లో ఎర్ర చెరువు మాయం.. అలుగుతో సహా చెరువు భూమి ఆక్రమణ?
- తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా స్పందన లేదంటున్న రైతులు.

సత్తుపల్లి నవంబర్ 13 మీ వార్త ఆర్ సి:



కల్లూరు మండలంలో చెరువులు, కుంటల ఆక్రమణలపై సమగ్ర విచారణ జరిపించి, వాటిని పరిరక్షించేందుకు హైడ్రా తరహా ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఎర్రబంజర్ మాజీ సర్పంచ్ జమలయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లా కల్లూరు మండల పరిధిలోని ఎర్రబంజర్ గ్రామంలో ఉన్న ఎర్ర చెరువు ఆక్రమణకు గురైందనే ఆరోపణలు స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. చెరువు అలుగుతో సహా చెరువు భూమిని ఆక్రమించుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒకప్పుడు గ్రామానికి నీటి ఆధారంగా ఉన్న చెరువు నేడు కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై సంబంధిత తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి స్పందన లేదని రైతులు వాపోతున్నారు. చెరువుల ఆక్రమణల వల్ల భవిష్యత్తులో సాగునీటి సమస్యలు, భూగర్భ జలాల కొరత ఏర్పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎర్రబంజర్‌లోనే కాకుండా కల్లూరు మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న చెరువులు, కుంటలపై కూడా సమగ్ర విచారణ చేపట్టాలని జమలయ్య కోరారు. ప్రభుత్వ భూములు, చెరువుల శిఖం భూములు, అలుగులు, తూములు ఆక్రమణకు గురయ్యాయా అనే అంశాలపై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరపాలని సూచించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి హైడ్రా తరహా ప్రత్యేక వ్యవస్థను కల్లూరు మండలంలో ఏర్పాటు చేసి, చెరువులు, కుంటల ఆక్రమణలను తొలగించి జలవనరులను కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు. రేపటి తరాలకు నీటి వనరులను అందించాలంటే నేటి నుంచే చెరువుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ప్రభుత్వ ఆస్తులు అంటే ఇంత నిర్లక్ష్యమా..

- అధికారులు ప్రభుత్వ ఆస్తులను పట్టించుకోరా...?
- అడవిని తలపిస్తున్న తహసిల్దార్ నివాసం.



సత్తుపల్లి నవంబర్13 మీ వార్త అర్ సి: పట్టణ నడిబొడ్డున ఉన్నటువంటి తాసిల్దార్ నివాసం కొన్ని సంవత్సరాల నుండి పట్టించుకోకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంది. రూ.. లక్షల విలువ చేసే ఆ భూమి,దాంట్లో ఉన్న ఇల్లు, రోడ్డు ప్రక్కనే ఉండటంతో ఏ ఒక్క అధికారి కూడా దాన్ని పట్టించుకున్న దాఖలాలు లేవు. ఎంతో విలువైనది తాసిల్దార్ ఉండటానికి ఉండే నివాసం చెట్టు,పుట్టలతో బూత్ బంగ్లా గా అడవిని తలపిస్తూ ఉంది. ప్రభుత్వ భూమి అని ఏ ఒక్క అధికారి కూడా దాని వైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. చూసింది దగ్గర నుంచి పట్టించుకోవాలని,శుభ్రం చేయించాలని ఎందుకు వచ్చింది నాకు అంటూ ఎవరూ చూడటం లేదు. ప్రభుత్వ అధికారులు ఇప్పటికైనా ప్రభుత్వ భూమి అని గుర్తించి,దానిని శుభ్రం చేయించి తాసిల్దార్ నివాసానికైనా ఇస్తే బాగుంటుందని, లేదా ఖాళీగా ఉంచే దానికంటే ఐసిడిఎస్ కార్యాలయం అద్దె భవనంలో నడిపిస్తున్నారు, కనీసం దానికైనా ఇస్తే ప్రభుత్వానికి అద్దె డబ్బులు అయినా మిగులుతాయి. సొంత భూములు అయితే అలా ఎవరైనా ఉంచుతారా...? అనే క్వశ్చన్ మార్క్ పట్టణంలో ప్రతి ఒక్కరికి తావిస్తుంది. ఇకనుంచి పట్టించుకోని పరిశుభ్రం చేపిస్తే లక్షల భూమిని కాపాడిన వారు అవుతారని,పట్టణ వాసులు ఆవేదన చెందుతున్నారు. అప్పటి హయాంలొ స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి జలగం వెంగళరావు ప్రజలకు తాసిల్దార్ అందుబాటులో ఉండే విధంగా అక్కడ నివాస గృహాన్ని ఏర్పాటు చేసి ఇల్లు కట్టించారు. 2004 సంవత్సరం వరకు దాంట్లో మండల అధికారి ఉంటూ, బదిలీ కావడంతో అప్పటినుంచి దానిని పట్టించుకున్న నాథుడే లేడు. ఇకనైనా పట్టించుకోని లక్షలు విలువ చేసే ప్రభుత్వ భూమిని కాపాడాలని సత్తుపల్లి ప్రజలు వేడుకుంటున్నారు.

పోలీస్ కానిస్టేబుల్ నమూనా పరీక్షకు విశేష స్పందన.





సత్తుపల్లి నవంబర్ 13 మీ వార్త టౌన్ రిపోర్టర్: సత్తుపల్లి నియోజకవర్గస్థాయిలో పోలీస్ ఉద్యోగాలను ప్రిపేర్ అవుతున్న వారికి జెవిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నమూనా పరీక్షను ఓఎంఆర్ పద్ధతిలో నిర్వహించడం జరిగింది.ఈ పరీక్షకు సంబంధించిన ప్రశ్న పత్రాన్ని సత్తుపల్లి పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ వీర ప్రసాద్ చేతుల మీదుగా ఆవిష్కరించడం జరిగింది. ఈ పరీక్షకు 70 మంది విద్యార్థులు హాజరు కావడం జరిగింది. డిసెంబర్లో మరలా నమూనా పరీక్షను నిర్వహించి విద్యార్థులకు పోలీస్ పరీక్షకు పూర్తిస్థాయిలో సన్నద్ధత కావడానికి తమ వంతు కృషి చేయునట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్ గోపి తెలియజేశారు. ఇట్టి అవకాశాన్ని నియోజకవర్గస్థాయిలో పోలీస్ ఉద్యోగాలకు ప్రిపేర్ అయ్యేవారు వినియోగించుకోవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల పరీక్ష నిర్వాహకులు డాక్టర్ ఎస్ బాబు, డాక్టర్ పద్మారాణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

సదర్లాండ్ గ్లోబల్ ప్రైవేట్ లిమిటెడ్ కి 11మంది శ్రీ చైతన్య విద్యార్థుల ఎంపిక.

ఖమ్మం నవంబర్ 13 మీ వార్త ప్రతినిధి:

స్థానిక పొన్నేకల్లోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో వర్చువల్ గా నిర్వహించిన ప్లేస్మెంట్ డ్రైవ్లో సదర్లాండ్ గ్లోబల్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు వార్షికంగా రూ.4 లక్షల వార్షిక వేతనంతో 11మంది ఎంపికయ్యారని కళాశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్ తెలిపారు.సదర్లాండ్ గ్లోబల్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ హెచ్.ఆర్.ఏళ్ళ అనూష మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి పాఠ్యపుస్తక జ్ఞానంతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్, కోడింగ్ మరియు తాజా టెక్నాలజీలపై అవగాహన పెంపొందించుకోవాలి. నిరంతర అభ్యాసమే విజయం సాధించడానికి ప్రధాన ఆయుధం అని సూచించారు. కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సాయి గీతిక మాట్లాడుతూ శ్రీ చైతన్య యజమాన్యం విద్యార్థులపై చూపుతున్న విశేషమైన శ్రద్ధ వల్ల రికార్డు స్థాయిలో ప్రాంగణ నియామకాలు జరుగుతున్నాయి అని, రాబోయే రోజులలో మరిన్ని ప్రాంగణ నియామకాలు జరపడానికి





కావాల్సిన ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలియపరిచారు. మల్లంపాటి శ్రీధర్ మాట్లాడుతూ ప్రాంగణ నియామకలలో సెలెక్ట్ అయిన విద్యార్థులను అభినందిస్తూ, వంద శాతం నియామకాలు జరిగేలాగా చర్యలు తీసుకున్నట్లు తెలియపరిచారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటా చలపతి మాట్లాడుతూ.. విద్యార్థులు ప్లేస్మెంట్ అవకాశాలకు సిద్ధమవ్వడానికి మాక్ ఇంటర్వ్యూలు, టెక్నికల్ ట్రైనింగ్లు నిర్వహిస్తున్నాము. ఈ కృషి ఫలితంగా ప్రతిభావంతులైన విద్యార్థులు ప్రతిష్టాత్మక సంస్థల్లో స్థానం సంపాదిస్తున్నారని అన్నారు. విద్యార్థులు ఉద్యోగాలు పొందడానికి కావలసిన శిక్షణ ను ప్రథమ సంవత్సరం నుంచి ఇస్తున్నామని, అది విద్యార్థులకు ఎంతో తోడ్పాటు ఇస్తుందని ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల డీన్ డాక్టర్ వి.సుదర్శన్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వైశాలి, టి పి ఓ డాక్టర్ రాజేష్, డిప్లమా ఇన్చార్జి కృష్ణ ప్రసాద్, డాక్టర్ సమీరా, డాక్టర్ దిలీప్, రాంబాబు, సురేష్ ఎన్నికైన విద్యార్థులకి అభినందనలు తెలిపారు.

నేటి బాలలే రేపటి భావి భారత నిర్మాతలు.

- సింగరేణి ఉన్నత పాఠశాలలో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు.

కొత్తగూడెం నవంబర్ 13 మీ వార్త ఆర్ సి: నేటి బాలలే రేపటి భావి భారత నిర్మాతలని ఎస్ఓటూ జీఎం మణుగూరు ఏరియా వి. రామారావు అన్నారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని సింగరేణి ఉన్నత పాఠశాలలో వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఆర్. కళ్యాణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి వి. రామారావు ముఖ్య అతిథిగా, డిప్యూటీ జీఎం పర్సనల్ మణుగూరు ఏరియా బి. శ్యాంప్రసాద్ విశిష్ట అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వి. రామారావు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసం, సేవాభావం వంటి మంచి లక్షణాలనుఅలవర్చుకోవాలని సూచించారు. దేశ నాయకుల జీవితాల నుంచి స్ఫూర్తి పొందుతూ ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు కృషి చేయాలనిపిలుపునిచ్చారు బి. శ్యాంప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు శారీరకంగా, మానసికంగా నిరంతరం సాధన చేయాలని అన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించాలంటే హార్డ్ వర్క్తో పాటు స్మార్ట్ వర్క్ కూడా అవసరమని





పేర్కొన్నారు.ప్రధానోపాధ్యాయురాలు ఆర్. కళ్యాణి మాట్లాడుతూ చాచా నెహ్రూకు బాలలంటే ఎంతో ప్రేమ, ఆప్యాయత ఉండేవని గుర్తుచేశారు. విద్యార్థులు మంచి విద్యను అభ్యసించి, మానవతా విలువలుకలిగిన బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. చిన్నారుల ఉత్సాహభరిత ప్రదర్శనలతో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం. వేణు, మస్తానయ్య, రాజసింహ, సరిత, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని లింగంపల్లి దయానంద్ సమన్వయం చేశారు.

సోడా కంపెనీలో కార్మికులకు చట్టాలను అమలు చేయించాలి.

- కార్మికులకు ఐఎఫ్టియు మద్దతు.

కొత్తగూడెం నవంబర్ 13 మీ వార్త ఆర్ సి: కొత్తగూడెం వికేసిఎం కార్మికులు తమకు కనీస వేతనాలు, కోటి చెల్లింపు పని స్థలాల్లో రక్షణ మెస్సులో పరిశుభ్రమైన వంట,సెలవులు చట్టపరమైన సౌకర్యాలు హక్కులను అమలు చేయాలని కోరుతూ కార్మికులు సాగిస్తున్న ధర్నా ఆందోళనలు చేస్తున్నారని సోడా యాజమాన్యం కార్మికుల సమస్యల ఎదల అనుసరిస్తున్న మొండి వైఖరిని విడనాడాలని కార్మికులపై బెదిరింపులు భయభ్రాంతులకు గురి చేసే చర్యలను మానుకోవాలని డిమాండ్ చేస్తున్నట్లు, సింగరేణి యాజమాన్యం కేంద్ర కార్మిక యంత్రాంగం జోక్యం చేసుకొని సోడా కంపెనీలో చట్టపరమైన హక్కులను, సౌకర్యాలను చట్టాలను అమలు చేయించాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఏవెంకన్న విజ్ఞప్తి చేశారు. వి కే సి ఎం ఓపెన్ కాస్ట్ లో సోడా కంపెనీ తమ సమస్యలపై కార్మికులు చేస్తున్న ఆందోళనకు సంపూర్ణ మద్దతును తెలియజేశారు. ఆందోళన చేస్తున్న కార్మికుల వద్దకు వెళ్లి తన సంఘీభావాన్ని తెలిపారు.
ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ సింగరేణి ఓపెన్ కాస్టలో కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు చెల్లించబడటం లేదని కాంట్రాక్టర్లు తన లాభాల కోసం కార్మికుల ప్రాణాలను ప్రాణంగా పెడుతున్నారని కనీస రక్షణ చర్యలు తీసుకోవడం లేదని వారి శ్రమదోపిడికి పాల్పడుతున్నారని అన్నారు.
కాంట్రాక్టర్లు పని స్థలాల్లో కనీస రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో కార్మికుల ప్రాణాలు కోల్పోతున్నారని మరణించిన కార్మికులను అనాధలుగా మారుస్తున్నారు తప్ప వారి కుటుంబాలను ఆదుకునేందుకు మరే ప్రమాదం జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నందుకు రక్షణ చర్యలు ఏర్పాటు చేయడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు సోడా కంపెనీలో 15 నెలలకు పైగా కార్మికులు పనిచేస్తున్నప్పటికీ బోనస్ చెల్లించకుండా కనీస వేతనాలు ఇవ్వకుండా అదనపు పనికి పోటీ చెల్లించకుండా చట్టపరంగా రావాల్సిన సెలవులు సౌకర్యాలను అమలు చేయకుండా యాజమాన్యం ఇష్టారాజ్యంగా కార్మికులపై వేధింపులు సాధింపులకు పాల్పడుతుందన్నారు పనిచేస్తున్న కార్మికులకు కనీసం సరైన తిండి రెస్ట్ సౌకర్యాన్ని ఏర్పాటు చేయకుండా యాజమాన్యం నిర్లక్ష్య వైఖరిని అనుసరిస్తుందని విమర్శించారు. తక్షణమే కార్మికులకు సమస్యలను పరిష్కరించాలని లేనియెడల కార్మికుల సమస్యలపై సాగిస్తున్న ఆందోళనకు మద్దతుగా సింగరేణి వ్యాప్తంగా కాంట్రాక్టు కార్మికులను కదిలించి



ఆందోళనలు చేస్తామని ఆయన హెచ్చరించారు. యొక్క ఆందోళనకు మద్దతుగా శుక్రవారం సంచిపెల్లి కాంగ్రెస్ పార్టీ మండలశీ చుంచుపల్లి మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి దుర్గారావు సీనియర్ కాంగ్రెస్ నాయకులు అచ్చా నాగరాజు తదితరులు దీక్షా శిబిరాన్ని సందర్శించి తమ పూర్తి మద్దతును తెలియజేశారు. యొక్క కార్యక్రమంలో జేఏసీ నాయకులు మార్షల్ శ్రీను, భూక్య మోహన్, జట్టి మోహన్, బూరుగు సతీష్, ఎం సంజీవ్, జి వెంకటేశ్వర్ రావు, విజయ్, నాగయ్య, ప్రమోద్, బాచి, కోటేష్, రఘు, పి ఎల్ సురేష్, హైమద్ పాషా, బాజీ, మల్లికార్జున్, రవి, రామ్చందర్, రవి గౌడ్, రాంబాబు, తదితర జేఏసీ నాయకులు పాల్గొన్నారు

టీఎస్ యుటిఎఫ్ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి.

- ఉపాధ్యాయులకు జిల్లా కమిటీ సభ్యుడు తొర్తి గురవయ్య పిలుపు.

నేలకొండపల్లి నవంబర్ 13 మీ వార్త ఆర్ సి: తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యుటిఎఫ్) ఖమ్మం జిల్లా ఏడవ ద్వైవార్షిక విద్యా మహాసభలను జయప్రదం చేయాలని టీఎస్ యుటిఎఫ్ జిల్లా కమిటీ సభ్యుడు తొర్తి గురవయ్య ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు.ఈ మేరకు శుక్రవారం నేలకొండపల్లి మండలం రాజేశ్వరపురం ఉన్నత పాఠశాలలో మహాసభలకు సంబంధించిన పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 15, 16 తేదీల్లో ముదిగొండలోని నవతేజ ఫంక్షన్హాల్లో జిల్లా మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మహాసభల్లో విద్యారంగానికి సంబంధించిన కీలక అంశాలపై ప్రముఖ విద్యావేత్తలు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ప్రసంగించనున్నట్లు పేర్కొన్నారు.భారత రాజ్యాంగం--ఎన్నికల కమిషన్ అంశంపై ప్రముఖ విద్యావేత్త, మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు,జాతీయ విద్యావిధానం అమలు పాఠశాలలు, ఉపాధ్యాయులపై చూపుతున్న ప్రభావం గురించి ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ ఆమంచి నాగేశ్వర్,ప్రభుత్వ విద్యారంగం--ఉపాధ్యాయ సమస్యలు--ప్రభుత్వ వైఖరి అనే అంశంపై టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి ప్రసంగించనున్నట్లు వివరించారు. మహాసభల సందర్భంగా ముదిగొండ హైస్కూల్ నుంచి నవతేజ ఫంక్షన్హాల్ వరకు వేలాది మంది ఉపాధ్యాయులతో భారీ ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు.అనంతరం సీనియర్ నాయకుల చేతుల మీదుగా జెండా ఆవిష్కరణ, అమరవీరులకు నివాళులర్పించి ప్రారంభ సమావేశం నిర్వహిస్తారని చెప్పారు.ఈ సమావేశానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు చావా రవి,ఏ.వెంకట్ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు వెల్లడించారు. రెండు రోజులపాటు జరిగే మహాసభల్లో



ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ, విద్యావ్యవస్థ పటిష్టత, ఉపాధ్యాయుల సంక్షేమం,దీర్ఘకాలంగా పరిష్కారం కాని ఉపాధ్యాయ సమస్యలపై విస్తృతంగా చర్చించి పలు తీర్మానాలు చేయనున్నట్లు తెలిపారు.ముఖ్యంగా పెండింగ్లో ఉన్న పీఆర్సీ అమలు, ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లుల చెల్లింపుపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల హక్కులు,సంక్షేమం, ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ లక్ష్యంగా నిర్వహిస్తున్న ఈ మహాసభలకు ఉపాధ్యాయులు వందలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని తొర్తి గురవయ్య కోరారు.

రైతులను ఇబ్బందులు పెట్టవద్దు
ప్రభుత్వ మద్దతు ధరకు కొనుగోలు చేయాలి: వైరా ఎమ్మెల్యే.

కారేపల్లి నవంబర్ 13 మీ వార్త ప్రతినిధి: పత్తి కొనుగోలు కేంద్రాల వద్ద రైతులను ఎలాంటి ఇబ్బందులు పెట్టవద్దని ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు కొనుగోలు చేయాలని వైరా శాసనసభ్యులు మాలోత్ రామదాసు నాయక్ అన్నారు. మండల పరిధిలోని వెంకట సాయి నగర్ వద్ద శుక్రవారం సిసిఐ ఏర్పాటుచేసిన ప్రతి కొనుగోలు కేంద్రాన్ని వైరా శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్ని నీవో ప్రభావంతో రైతులకు ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో తీవ్ర నష్టం వాటిల్లిందని గుర్తు చేశారు. రైతులు దళారుల బారిన పడకుండా పత్తి కొనుగోలు కేంద్రాల ద్వారా పత్తిని విక్రయించాలని కోరారు. ప్రభుత్వానికి ఆర్థికంగా భారమైన గత సంవత్సరం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి ప్రభుత్వమే కొనుగోలు చేసిందన్నారు. కాంగ్రెస్ కరువు తెచ్చిందని ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వాల నిర్వాకం వల్లనే ఈనాడు ఈ పరిస్థితి ఏర్పాటు అయిందన్నారు. రైతుల ప్రయోజనం కోసం





మండలంలోని వివిధ ప్రాంతాల్లో చెక్ డాం లో ఏర్పాటు కోసం లక్షలాది రూపాయల వ్యయంతో ప్రతిపాదనలు పంపామని త్వరలోనే నిధులు మంజూరు అవుతాయన్నారు. రైతులు రబీ సీజన్లో ఆరుతడి పంటలు సాగు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎల్పీఓ రాంబాబు, తాసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వరరావు, ఎంపీడీవో బానోత్ పద్మ, ఐసీడీఎస్ సీడీపీఓ కే.ఉమా, ఐకేపీ ఏపీఎం పిడమర్తి వెంకటేశ్వర్లు, వ్యవసాయ శాఖ అధికారి బట్టు అశోక్ కుమార్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూరి రాంబాబు సింగరేణి సర్పంచ్ మేదరి వీరప్రతాప్ టోనీ, దిశ కమిటీ సభ్యులు పోలంపల్లి సర్పంచ్ ధారావత్ హేమలత సొసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు, కుమార్, స్థానిక ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పగడాల మంజుల, బానోతు రామ్మూర్తి, పెదబోయిన ఉమాశంకర్ విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ ఎంపీపీ బానోతు దేవలా నాయక్, అడ్డగోడ ఐలయ్య, సింగరేణి సర్పంచుల సంఘం అధ్యక్షుడు రంజిత్ కుమార్ సార్, కిసాన్ మోర్చా నాయకులు కడియాల సుధాకర్, షాదీ ఖానా చైర్మన్ యాకూబ్ అలీ, అధికారులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అభివృద్ధి పనులు ఐక్యంగా పూర్తి చేద్దాం.





- అధైర్య పడవద్దు- నేనున్నాను.
- వైరా ఎమ్మెల్యే భరోసా.

కారేపల్లి నవంబర్ 13 మీ వార్త ప్రతినిధి: ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి అందజేస్తామని ఇందిరమ్మ స్ఫూర్తి తో ప్రతి పేదవారికి కుడు గూడు గుడ్డ అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఎవరు అధైర్య పడవద్దు నేనున్నాను అని వైరా శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. మండల కేంద్రమైన కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో శుక్రవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా మంజూరైన చేయూత పింఛన్లు ఇందిరమ్మ ఇల్లు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ నిర్వహించారు. ఎంపీడీవో భూక్యపద్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూతెలంగాణ రాష్ట్రం లో గల ప్రతి పేదవారికి కనీస సౌకర్యాలు అయినా కుడు గూడు గుడ్డ అందించి ఇందిరమ్మ కన్నకలల్ని నిజం చేయడమే ధ్యేయం గా ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. వైరా,నియోజకవర్గం ను ముఖ్యమంత్రి,జిల్లా మంత్రుల సహాకారాలతో అన్ని రంగాల్లో సమగ్రమైన అభివృద్ధి చేయడానికి కృషి చేస్తూ ఇప్పటికే అనేక రకాల నిధులతో అభివృద్ధి పనులు కొనసాగిస్తున్నామని, అన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను పూర్తిగా అమలు చేస్తున్నామన్నారు. రాజకీయాల కతీతంగా అన్ని వర్గాల సంక్షేమమే ప్రధాన ఎజెండాగా పనిచేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో గ్రామాల్లో మౌలిక సదుపాయాలు సమకూర్చడంతో పాటు త్రాగునీటి సమస్య తలెత్తకుండా విస్తృతమైన చర్యలు చేపట్టామన్నారు. అర్హులైన అందరికి అన్ని సంక్షేమపథకాలు ఇస్తామని ఎవరుకూడా నిరుత్సాహపడవద్దని, చెప్పారు. రైతులకు రెండు లక్షల రూపాయలు రుణమాఫీ చేయడంతోపాటు వ్యవసాయ పెట్టుబడులకు ఎకరాకు 12 వేల రూపాయలు ఆర్థిక సహాయం ప్రభుత్వం అందజేస్తుందన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతోపాటు డ్వాక్రా సంఘాల ద్వారా వడ్డీ లేని రుణాలను అందజేస్తుందన్నారు. మండల పరిధిలోని అ ప్పాయి గూడెం కేంద్రంగా 50 వేల మందికి పైగా విద్యార్థులకు అల్పాహారం అందజేసే విధంగా చర్యలు తీసుకుంటున్నా మన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా కోట్లాది రూపాయల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయన్నారు. సింగరేణి మండలం లో సుమారు 790 మందికి చేయూత పెన్షన్లు అందజేయడంతో పాటు2856 నూతన రేషన్ కార్డులో పంపిణీ చేయడంతో పాటు 17వేలకు పైగా లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు అందజేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో డీఎల్పీఓ రాంబాబు, తాసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వరరావు, ఎంపీడీవో బానోత్ పద్మ, ఐసీడీఎస్ సీడీపీఓ కే.ఉమా, ఐకేపీ ఏపీఎం పిడమర్తి వెంకటేశ్వర్లు, వ్యవసాయ శాఖ అధికారి బట్టు అశోక్ కుమార్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూరి రాంబాబు సింగరేణి సర్పంచ్ మేదరి వీరప్రతాప్ టోనీ, దిశ కమిటీ సభ్యులు పోలంపల్లి సర్పంచ్ ధారావత్ హేమలత సొసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు, కుమార్, స్థానిక ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పగడాల మంజుల, బానోతు రామ్మూర్తి, పెదబోయిన ఉమాశంకర్ విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ ఎంపీపీ బానోతు దేవలా నాయక్, అడ్డగోడ ఐలయ్య, సింగరేణి సర్పంచుల సంఘం అధ్యక్షుడు రంజిత్ కుమార్ సార్, కిసాన్ మోర్చా నాయకులు కడియాల సుధాకర్ షాదీ ఖానా చైర్మన్ యాకూబ్ అలీ అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

అర్హులందరికీ చేయూతనిస్తాం.. అండగా నిలుస్తాం.

- పింఛన్ల మంజూరుతో పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా.
- గత ప్రభుత్వ హయాంలో ఎనిమిదేళ్ల పాటు కొత్త పింఛన్లు ఇవ్వలేదు.
- దీపావళి రోజున ప్రకటించిన హామీని అమల్లోకి తెచ్చాం.

రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి.

- నేలకొండపల్లి మండలంలో 1,138 మందికి నూతన పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ.

నేలకొండపల్లి నవంబర్ 13 మీ వార్త ఆర్ సి:

నేలకొండపల్లి అర్హులైన ప్రతి ఒక్కరికీ చేయూత పథకం ద్వారా పింఛన్లు అందించి ఆర్థికంగా అండగా నిలుస్తామని రాష్ట్ర రెవెన్యూ,గృహ నిర్మాణం, సమాచార, పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఒంటరి మహిళలు, వితంతువులు, గీత, చేనేత కార్మికులు, దివ్యాంగుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. శుక్రవారం నేలకొండపల్లిలోని మార్కెట్ యార్డు ప్రాంగణంలో చేయూత పథకం కింద నూతనంగా మంజూరైన 1,138 పింఛన్లకు సంబంధించిన మంజూరు పత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వ ఎనిమిదేళ్ల పాలనలో కొత్త పింఛన్ల మంజూరు ఊసే లేదని విమర్శించారు. పింఛన్ల కోసం పేదలు కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా, ఏళ్ల తరబడి ఎదురుచూసినా గత పాలకులు





పట్టించుకోలేదన్నారు. ఎన్నికలకు ముందు తాను పర్యటించిన సమయంలో పేదల కష్టాలను ప్రత్యక్షంగా చూసి చలించిపోయానని గుర్తుచేశారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులకు కొత్తగా పింఛన్లు మంజూరు చేయాలని నిర్ణయించి అమలు చేస్తున్నట్లు తెలిపారు. దీపావళి పండుగ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల మందికి కొత్త పింఛన్లు అందించనున్నట్లు ప్రకటించి, ఆ హామీని కార్యరూపంలోకి తీసుకొచ్చామని చెప్పారు. గత పాలకులు కమీషన్ల కోసం లక్ష కోట్ల రూపాయలతో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి, చివరకు అది కూలేశ్వరం ప్రాజెక్టుగా మిగిలిందని విమర్శించారు. ఇంకా ఎవరైనా అర్హులు పింఛన్ల కోసం ఎదురుచూస్తుంటే వారిని గుర్తించి తప్పకుండా మంజూరు చేస్తామని, ఎవరూ అధైర్యపడవద్దని భరోసా ఇచ్చారు.

మండలంలో 1,138 మందికి కొత్త పింఛన్లు.

నేలకొండపల్లి మండలంలో చేయూత పథకం కింద మొత్తం 1,138 మందికి కొత్తగా పింఛన్లు మంజూరయ్యాయి. వీరికి ప్రతినెలా రూ.30,16,208 పింఛన్ల రూపంలో అందనుంది. నవంబర్ 13, 2026 నాటికి అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. దివ్యాంగులు 361 మందికి నెలకు రూ.14,49,776, ఒంటరి మహిళలు 107 మందికి రూ.2,15,712, గీత కార్మికులు 64 మందికి రూ.1,29,024, చేనేత కార్మికులు ఇద్దరికి రూ.4,032, వితంతువులు 604 మందికి రూ.12,17,664 చొప్పున పింఛన్లు మంజూరయ్యాయి. దివ్యాంగులకు ఒక్కొక్కరికి నెలకు రూ.4,016, మిగిలిన వర్గాల లబ్ధిదారులకు రూ.2,016 చొప్పున పింఛను అందనుంది. కొత్త పింఛన్లతో కలిపి మండలంలో మొత్తం 9,428 మంది లబ్ధిదారులకు ప్రతినెలా రూ.1,64,40,896 మేర ఆర్థిక సహాయం అందుతోందని అధికారులు వివరించారు.

ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ శ్రీజ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొడాలి గోవిందరావు, సీనియర్ నాయకులు శాఖమూరి రమేష్, నెల్లూరి భద్రయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొడ్డు బొందయ్య, పలువురు సర్పంచులు, ఉప సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తేగడలో బ్రిడ్జి వంతెన మొదటి భాగంలో రోడ్డుపై భారీ గొయ్యి.. ప్రమాదాలకు నిలయంగా మారిన రహదారి.

- వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం -- తక్షణమే మరమ్మతులు చేపట్టాలని ప్రజల వాహనదారులు విజ్ఞప్తి.

చర్ల నవంబర్ 13 మీ వార్త ప్రతినిధి: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం తేగడ గ్రామంలోని తాళ్లపేరు బ్రిడ్జి వద్ద రహదారిపై ఏర్పడిన భారీ గొయ్యి వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. రహదారిపై ఏర్పడిన ఈ గొయ్యి కారణంగా నిత్యం రాకపోకలు సాగించే వాహనదారులు ప్రమాదాల భయంతో ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ మార్గంలో ప్రతిరోజూ అనేక వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే రహదారి లో బ్రిడ్జి పక్కన ఏర్పడిన గొయ్యి కారణంగా ఎదురెదురుగా వచ్చే వాహనాలు ఒకదానికొకటి దారి ఇవ్వడం కష్టంగా మారింది. ముఖ్యంగా నాలుగు చక్రాల వాహనాలు, ద్విచక్ర వాహనాలు, మూడు చక్రాల వాహనాలు ఎదురెదురుగా వచ్చినప్పుడు తప్పించుకునేందుకు తగినంత స్థలం లేక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి నిర్లక్ష్యం జరిగినా వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో గొయ్యి స్పష్టంగా కనిపించకపోవడంతో ప్రమాదాల ముప్పు మరింత ఎక్కువగా ఉందని చెబుతున్నారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి రహదారిపై ఏర్పడిన గొయ్యిని పరిశీలించి, తక్షణమే మరమ్మతులు చేపట్టాలని గ్రామ ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు. ప్రమాదాలు జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే సమస్యను పరిష్కరించి ప్రజల ప్రాణాలకు భద్రత కల్పించాలని వారు ఆర్ అండ్ బి అధికారులను విజ్ఞప్తి చేస్తున్నారు.



రైతు ఆకాశం వైపు కాదు గోదావరి జలాల వైపు చూచేలా చేయాలి.

- సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు.

కారేపల్లి నవంబర్ 13 మీ వార్త ప్రతినిధి: సింగరేణి మండల రైతాంగం నీటి కోసం ఆకాశం వైపు కాకుండా మండలానికివచ్చే గోదావరి జలాలవైపు చూచేలా వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ప్రత్యేక చొరవ చూపాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు అన్నారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో శుక్రవారం కారేపల్లిలో జరిగిన చేయూత పింఛన్ల పంపిణి కార్యక్రమానికి హాజరైన ఆయన మండలసమస్యలను ఎమ్మెల్యేకువివరించారు. పోడు సాగుచేసుకుంటున్న గిరిజన, గిరిజనేతరుల పోడును అధికారులు, ఎఫ్ఆర్ కమిటీలు సర్వే చేశాయని వాటిలో గిరిజనేతరులతోపాటు గిరిజన రైతులకు హక్కు పత్రాలు అందలేదన్నారు. వాటిని అందించి న్యాయం చేయాలని కోరారు. సింగరేణి సంస్థ, డోలమైట్ మైన్స్ ద్వారా ప్రభావిత గ్రామాల అభివృద్ధి జరగటం లేదని దానిపై ప్రత్యేక దృష్టి పెట్టి నిధులు రప్పించి అభివృద్ధి చేయాలని కోరారు. కారేపల్లిలో వైద్య సేవలు సామాన్యులకు అందటం లేదని, పీహెచ్సీ ని 50 పడకల ఆసుపత్రిగా మార్చేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకరావాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే రాందాస్ నాయక్ సమస్యల పరిష్కారం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



మంత్రి పొంగులేటి కి చిత్తారు వారి వివాహ ఆహ్వానం.

- ఆహ్వాన పత్రిక అందించిన మేకల మల్లి బాబు యాదవ్, చిత్తారు సింహాద్రి యాదవ్.

కామేపల్లి నవంబర్ 13 మీ వార్త ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి కి ఖమ్మం లోని వారి స్వగృహంలో అఖిల భారత యాదవ మహాసభ జిల్లా యువజన అధ్యక్షులు చిత్తారు సింహాద్రి యాదవ్, పొంగులేటి ప్రధాన అనుచరుడు డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ తో కూడి ఈనెల 15 న బోనకల్ రోడ్ లోని లక్ష్మీ ఫంక్షన్ హాల్ లో జరగనున్న చిత్తారు సింహాద్రి యాదవ్- మాధవిల కూతురు జోషిత -గురునాథ్ ల వివాహానికి ఆహ్వానం అందించారు. ఎన్ని కార్యక్రమాలు ఉన్నప్పటికీ తప్పకుండా వచ్చి నూతన జంట ను ఆశీర్వదిస్తానని చెప్పినట్లుగా మల్లి బాబు యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కన్నెబోయిన సీతారామయ్య, బొర్రా రాజశేఖర్, ఉన్నం బ్రహ్మయ్య, ప్రతాప్, తుప్పాతి రవి, పొట్లపల్లి సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సత్తా చాటిన గీతాంజలి విద్యాలయం విద్యార్థులు

కామేపల్లి నవంబర్ 13 మీ వార్త ప్రతినిధి: జిల్లా ఎక్సైజ్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో జరిగిన ఖమ్మం జిల్లా స్థాయి క్విజ్ పోటీలలో పాల్గొని కామేపల్లి గీతాంజలి విద్యాలయం విద్యార్థులు జిల్లా స్థాయి లో ఉత్తమ ప్రతిభ కనబర్చి బహుమతులు కైవసం చేసుకున్నారు.ఈ జిల్లా స్థాయి పోటీలలో 320 పాఠశాలలు పాల్గొనగా మొదటి వరుస లో నిలిచి జిల్లా డ్రగ్ కంట్రోలర్ ఆఫీసర్ సోమిరెడ్డి చేతుల మీదుగా రెండు సైకిల్ లను 10వ, తరగతి విద్యార్థులు ఏ .ప్రణయ్ ,కె .వెంకట్ గెలుచుకున్నారు. ఉత్తమ ప్రతిభ వంతులను తీర్చిదిద్దే శిక్షకుల బహుమతిని గీతాంజలి విద్యాలయం ఉపాధ్యాయులు జి.రమేష్ గెలుపొందారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అడిషనల్ కలెక్టర్ శ్రీజ, ఖమ్మం మాజీ మేయర్ నీరజ తదితరులు పాల్గొని విజేతలను అభినందించారు.



నేలకొండపల్లిలో ఘనంగా చేయూత పెన్షన్ల పంపిణీ కార్యక్రమం.

- పెన్షన్‌దారులకు చేయూత పెన్షన్ పత్రాలు అందించిన పైనంపల్లి గ్రామపంచాయతీ ప్రెసిడెంట్ కుక్కల నరేష్.



ఖమ్మం నవంబర్ 13 మీ వార్త ప్రతినిధి: నేలకొండపల్లి మండలంలోని పైనంపల్లి గ్రామ చేయూత పెన్షన్‌దారులకు పెన్షన్ పత్రాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పైనంపల్లి గ్రామపంచాయతీ ప్రెసిడెంట్ కుక్కల నరేష్ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ



కార్యదర్శి సమన్వయంతో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల నాయకులు యదవల్లి సైదులు, యూత్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు యదవల్లి నాగరాజు, పైనంపల్లి మాజీ సొసైటీ చైర్మన్ నల్లని మల్లికార్జునరావు పాల్గొని అర్హులైన పెన్షన్‌దారులకు చేయూత పెన్షన్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు పెన్షన్‌దారులతో మాట్లాడి వారి సంక్షేమానికి సంబంధించిన సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం వృద్ధులు, అర్హులైన లబ్ధిదారుల జీవనానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది, సైదులు, మస్తాన్, స్థానిక నాయకులు, ప్రజలు, మహిళలు, పెన్షన్‌దారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కామేపల్లి లో భక్తిశ్రద్ధలతో ఘనంగా నాగుల చవితి వేడుకలు.





కామేపల్లి నవంబర్ 13 మీ వార్త ప్రతినిధి: నాగుల చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని కామేపల్లి మండల వ్యాప్తంగా భక్తులు వేడుకలను శుక్రవారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. మండల కేంద్రమైన కామేపల్లి, గోపాలపురం గ్రామాలలో తెల్లవారుజాము నుంచే మహిళలు, భక్తులు నాగేంద్ర స్వామి పుట్టల వద్దకు చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాలు, పసుపు, కుంకుమ, పూలతో నాగదేవతకు భక్తి పూర్వకంగా అభిషేకాలు, పూజలు చేశారు.తమ కుటుంబాలు ఆయురారో గ్యాలతో, సుఖసంతోషాల తో ఉండాలని, కోరుకున్న కోరికలు నెరవేరాలని నాగేంద్ర స్వామిని ప్రార్థించారు.ఈ సందర్భంగా భక్తుల సందడి నెలకొంది. మహిళలు సంప్రదాయబ ద్ధంగా నాగుల చవితి వేడుకల్లో పాల్గొని భక్తిని చాటుకున్నారు.ఈ వేడుకలలో మహిళలు గాదె జ్యోతి, ఏపూరి అనిత, పూజారి దుంపటి జోగమ్మ, బండి కవిత, గుడివాడ సరిత, అజ్మీర కౌసల్య, పగిళ్ల సీత, పగిళ్ల రమాదేవి, కాంత తదితరులు పాల్గొని పూజలు నిర్వహించడం జరిగింది.

ఖమ్మంలో మలబార్ గోల్డ్‌లో 'మైన్ డైమండ్ షో'

- నవంబర్ 17 వరకు ప్రత్యేక ఆభరణాల ప్రదర్శన ఆకర్షణీయమైన ఆఫర్లు.



ఖమ్మం నవంబర్ 12 మీ వార్త ప్రతినిధి: ఖమ్మం మలబార్ గోల్డ్ డైమండ్స్ ఖమ్మం షోరూంలో 'మైన్ డైమండ్ షో' ను ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ రాధిక,అష్మిత,నందిని లు ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవంబర్ 12 నుంచి 17 వరకు నిర్వహించే ఈ ప్రదర్శనలో వివిధ రకాల వజ్రాభరణాలు,లైట్ వెయిట్, వివాహ వేడుకలకు ప్రత్యేక నగలు అందుబాటులో ఉన్నాయి అని పేర్కొన్నారు. బంగారు, అన్‌కట్, రత్నాభరణాల తయారీ తరుగు చార్జీలపై 30 శాతం వరకు,వజ్రాభరణాల వజ్రాల విలువపై 30 శాతం వరకు ప్రత్యేక తగ్గింపులు ప్రకటించారు.ఈ ఆఫర్లు నవంబర్ 15 వరకు మాత్రమే వర్తిస్తాయని స్టోర్ హెడ్ జితిన్ వి కె , స్టోర్ మేనేజర్ గుజ్జ కిషన్ రావు,అసిస్టెంట్ మేనేజర్ విష్ణు విజయ్ , మార్కెటింగ్ మేనేజర్ రుద్ర రామ కృష్ణ లు తెలిపారు.నాణ్యత పారదర్శకతకు ప్రాధాన్యతనిస్తూ హాల్‌మార్క్ బంగారం,ధృవీకరించిన వజ్రాభరణాలు, జీవితకాల ఉచిత నిర్వహణ వంటి సౌకర్యాలను సంస్థ అందిస్తోందని పేర్కొన్నారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 1993లో కేరళలో స్థాపించబడిన మలబార్ గోల్డ్ ఉ డైమండ్స్ ప్రస్తుతం 14 దేశాల్లో 450కు పైగా షోరూములతో అంతర్జాతీయ స్థాయిలో విస్తరించిందని , ప్రపంచంలోని ప్రముఖ జ్యువెలరీ రిటైల్ సంస్థల్లో ఒకటిగా గుర్తింపు పొందిన ఈ సంస్థ ఖమ్మం వినియోగదారులకు సరికొత్త డిజైన్లను , నాణ్యమైన ఆభరణాలను అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతోందని అన్నారు.

2028 జూన్ 2 నాటికి కోహెడ మార్కెట్

హైదరాబాద్ : గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ప్రజల అవసరాలు, రైతులకు మెరుగైన మార్కెటింగ్ సదుపాయాలు కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న కోహెడ ఇంటిగ్రేటెడ్ ఫ్రూట్ మార్కెట్ నిర్మాణ పనులు వేగవంతమయ్యాయి. హైదరాబాద్ శివారులోని రంగారెడ్డి జిల్లా కోహెడలో ఔటర్ రింగ్ రోడ్డుకు ఆనుకుని దాదాపు 239 ఎకరాల విశాలమైన స్థలంలో ఈ మార్కెట్‌ను ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. ఆసియాలోనే అత్యంత ఆధునిక ప్రమా?కలతో కూడిన పండ్ల మార్కెట్‌గా దీనిని తీర్చిదిద్దుతున్నారు.తాజాగా ఈ ప్రాజెక్ట్ పురోగతిపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సంబంధిత అధికారులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.

జిల్లాలో రూ.1,080 కోట్ల లింకేజీ రుణాల పంపిణీ లక్ష్యం.

- గ్రామ సమాఖ్య, పంచాయతీ భవనాల నిర్మాణాలకు నిధుల కొరత లేదు.
- ఉపాధి పనుల్లో కొలతల ప్రకారమే కూలీలకు వేతనాలు చెల్లించాలి.
- విలేకరుల సమావేశంలో డీఆర్డీఓ కొండపల్లి శ్రీరామ్.

నేలకొండపల్లి నవంబర్ 13 మీ వార్త ఆర్ సి: జిల్లాలో స్వయం సహాయక సంఘాలకు రూ.1,080 కోట్ల లింకేజీ రుణాలు అందించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి (డీఆర్డీఓ) కొండపల్లి శ్రీరామ్ తెలిపారు. ఇప్పటివరకు రూ.560 కోట్ల రుణాలను పంపిణీ చేశామని, మిగిలిన రూ.520 కోట్లను త్వరలోనే అందించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. శుక్రవారం నేలకొండపల్లి మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయాన్ని ఆయన సందర్శించి సిబ్బందితో లింకేజీ రుణాల పంపిణీ, ఉపాధి హామీ పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోందన్నారు. మహిళా సంఘాలకు ఆర్థిక చేయూత అందించడంలో లింకేజీ రుణాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు.

ఉపాధి పనుల్లో నిబంధనలు పాటించాలి.

వీబీజీ రాంజీ పథకం కింద చేపడుతున్న ఉపాధి పనుల్లో కూలీలకు చేసిన పని కొలతల ఆధారంగానే వేతనాలు చెల్లించాలని సిబ్బందిని ఆదేశించారు. పనుల నిర్వహణలో ఎలాంటి అక్రమాలకు, అవకతవకలకు



తావివ్వకూడదని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కూలీలు పని ప్రదేశంలో కనీసం నాలుగు గంటలపాటు పనిచేయాలని సూచించారు. పనుల పర్యవేక్షణలో భాగంగా జీపీఎస్ ఆధారిత ఫొటోలు తీస్తున్నట్లు తెలిపారు. కూలీలకు వాస్తవంగా చేసిన పనికంటే అధికంగా వేతనాలు నమోదు చేసినట్లు గుర్తిస్తే సంబంధిత సిబ్బంది జీతాల నుంచి ఆ మొత్తాన్ని రికవరీ చేస్తామని స్పష్టం చేశారు. జిల్లావ్యాప్తంగా ప్రస్తుతం రోజుకు సుమారు 2,100 మంది కూలీలు ఉపాధి పనులకు హాజరవుతున్నారని తెలిపారు. కూలీల హాజరు శాతంలో జిల్లా రాష్ట్రస్థాయిలో 15వ స్థానంలో ఉందని పేర్కొన్నారు.

భవన నిర్మాణాలకు నిధుల కొరత లేదు.

గ్రామ సమాఖ్య (వీవో), గ్రామపంచాయతీ భవనాల నిర్మాణాలకు నిధుల కొరత లేదని డీఆర్డీఓ స్పష్టం చేశారు. పనులు పూర్తిచేసిన వెంటనే సంబంధిత బిల్లులను చెల్లిస్తున్నామని తెలిపారు. జిల్లావ్యాప్తంగా 490 వీవో భవనాలు, 103 గ్రామపంచాయతీ భవనాలు నిర్మాణ దశలో ఉన్నాయని వెల్లడించారు. ఇప్పటివరకు నిర్మాణ పనులు చేపట్టిన వారికి రూ.9.20 కోట్ల మేర చెల్లింపులు చేసినట్లు వివరించారు. ఇంకుడు గుంతలు, సామూహిక ఇంకుడు గుంతల నిర్మాణాలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించినట్లు తెలిపారు. ప్రభుత్వ లక్ష్యాలను నిర్దేశిత సమయంలో పూర్తి చేసేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి ఐకేపీ ఏపీఎం కట్టా సురేందర్, సీసీలు పెద్దపాక వెంకటేశ్వరరావు, పెరుగు మల్లయ్య, నాగేంద్ర, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్న పాదయాత్రపై లారీ దూసుకొచ్చిన ఘటనపై టీఆర్పీ ఆగ్రహం.

- నిందితులను వెంటనే అరెస్టు చేయాలి.
- ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేకుంటే ముఖ్యమంత్రి రాజీనామా చేయాలి టీఆర్పీ ఖమ్మం జిల్లా నేతల డిమాండ్.

ఖమ్మం నవంబర్ 13 మీ వార్త ప్రతినిధి:

బహుజనుల హక్కుల సాధన కోసం, అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం ప్రజల్లోకి వెళ్లి పాదయాత్ర చేస్తున్న తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పాదయాత్రపై లారీ దూసుకొచ్చిన ఘటన తీవ్ర కలకలం రేపింది. మోత్కూరు సమీపంలోని మాలగిరి ప్రాంతంలో పాదయాత్ర సాగుతుండగా వేగంగా వచ్చిన లారీ పాదయాత్రలోని వాహనాన్ని, కారును ఢీకొట్టడంతో ఐదారుగురు తీవ్రంగా గాయపడినట్లు పార్టీ నాయకులు తెలిపారు. ఈ ఘటనను తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఖమ్మం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జ్ గట్ల రాజన్న, జిల్లా అధ్యక్షుడు దామల సత్యం మాట్లాడుతూ ఒక బహుజన బిడ్డగా అట్టడుగు, బడుగు, బలహీన వర్గాల ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడుతూ, వారి సమస్యలను వెలుగులోకి తెచ్చేందుకు ప్రజా పాదయాత్ర చేస్తున్న తీన్మార్ మల్లన్న యాత్రలో



ఇలాంటి ఘటన చోటుచేసుకోవడం అత్యంత దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది సాధారణ ప్రమాదమా? లేక దీని వెనుక ఏదైనా కుట్ర దాగి ఉందా? అనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. ఈ ఘటన వెనుక ఎంతటి పెద్ద వ్యక్తులు ఉన్నా, ఏ రాజకీయ శక్తుల ప్రమేయం ఉన్నా ప్రభుత్వం నిష్పక్షపాతంగా దర్యాప్తు జరిపి వాస్తవాలను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ఘటనకు బాధ్యులైన వారిని గుర్తించి వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని, గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించి బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని కోరారు. ప్రజల హక్కుల కోసం పోరాడుతున్న బహుజన నాయకులకే భద్రత లేకపోతే సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ శ్రేణుల్లో ఈ ఘటన తీవ్ర ఆందోళనకు కారణమైందన్నారు. ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయాలను, ప్రజా పోరాటాలను భౌతిక దాడులతో అణచివేయాలనుకోవడం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఈ ఘటనపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే తక్షణమే ప్రత్యేక దర్యాప్తు చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, లేకపోతే ఈ ఘటనపై నైతిక బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ గట్ల రాజన్న, జిల్లా అధ్యక్షుడు దామల సత్యం, జిల్లా ఉపాధ్యక్షులు పెరమలపల్లి నాగార్జున, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు తేలపుట్ట జగపతి, టౌన్ అధ్యక్షుడు కొప్పుల రామారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పోలోజు వినయ్, టౌన్ ప్రధాన కార్యదర్శి కేతవరపు లెనిన్ పాల్గొన్నారు. అలాగే మానవ హక్కుల పరిరక్షణ సమితి చైర్మన్ చలమల హైమావతి, కిరణ్మయి, అనిత, మాదవి, సాయి, సైదులు, చారి తదితరులు ఈ ఘటనను తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా పలువురు నూతనంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీలో చేరారు.

మాది పేదల పక్షపాత ప్రభుత్వం.

- అందుకే రాష్ట్రవ్యాప్తంగా 8 లక్షల ఇందిరమ్మ ఇళ్లిచ్చాం.
- కేంద్రంలో రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే మా లక్ష్యం.
- రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి.

కూసుమంచి ఖమ్మం నవంబర్ 12 మీ వార్త ప్రతినిధి: ఈ ప్రజా ప్రభుత్వం పేదల పక్షపాత ప్రభుత్వమని, నిరంతరం వారి సంక్షేమానికి పాటుపడుతుందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి రెడ్డి స్పష్టం చేశారు. చేయూత పథకంలో భాగంగా కూసుమంచిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో 1,071 మందికి, ఖమ్మం రూరల్ మండలంలోని ఎం.వెంకటాయపాలెం గ్రామంలోని హైస్కూల్ గ్రౌండ్ లో 851 మందికి నూతన పింఛన్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయా సభల్లో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ..



మొదటి విడతలో 4.5 లక్షల ఇళ్లు, రెండో విడతలో 2.5 లక్షల ఇళ్లు, హైదరాబాద్ లో లక్ష ఇళ్లను పేదలకు కేటాయించామని, ఫైనల్ బిల్లులను ఈ నెలలోనే మంజూరు చేస్తామని ప్రకటించారు. గత పాలకులు పేదల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారని, ఎనిమిదేళ్లలో ఒక్క పింఛన్ కూడా ఇవ్వకుండా నిర్లక్ష్యం చేశారని అన్నారు. తమ ప్రజా ప్రభుత్వంలో చేయూత పింఛన్ల కోసం మంజూరు పత్రాలు అందజేస్తున్నామని, ఈనెల 19వ తేదీ నుంచే లబ్ధిదారులకు ఆర్థిక భరోసా



అందిస్తుందని ప్రకటించారు. కూసుమంచి కేంద్రంలో వంద పడకల ఆసుపత్రితో పాటు కొట్లాది నిధులతో అనేక అభివృద్ధి పనులు చేపట్టామని వివరించారు. కేంద్ర ప్రభుత్వానికి ఎన్నికల కమిషనర్ తొత్తుగా మారి 7కోట్ల ఓట్లను తొలగించారని, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేసుకోవడమే తమ లక్ష్యమని వెల్లడించారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ కూసుమంచి మండల అధ్యక్షులు బజ్జూరి వెంకటరెడ్డి, ఖమ్మం రూరల్ మండలాధ్యక్షులు తోట వీరభద్రం, పలువురు అధికారులు, సర్పంచ్లు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కామేపల్లి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో వైద్య శిబిరం.

విద్యారంగంలో రాణింపుకు ఆరోగ్యమే మూలాధారం.:డాక్టర్ శ్రీదేవి.

కామేపల్లి నవంబర్ 13 మీ వార్త ప్రతినిధి: కామేపల్లి ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు.డాక్టర్ శ్రీదేవి ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది శిబిరం నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ శ్రీదేవి బాలికలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. ఆరోగ్యపరమైన సలహాలు సూచనలు అందించారు. బాలికలు ఆరోగ్య విషయంలో అప్రమత్తంగా ఉండాలని కోరారు. అవసరమైన సమయంలో ప్రభుత్వ వైద్య సేవలను పొందాలని కోరారు.ఆరోగ్యంగా ఉన్నప్పుడే విద్యారంగంలో రాణించటం జరుగుతుందన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, చలిగాలులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.ఈ శిబిరంలో పాఠశాల హెచ్ఎం రఘునాథ్, మ్యాట్రిన్ స్వర్ణలత, హెల్త్ సూపర్వైజర్ రాధాకృష్ణ, ఏఎన్ఎంలు వెంకటరమణ, ఉష, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పదవులు ఉన్నా లేకపోయినా ప్రజాసేవే నా లక్ష్యం.





- 2014 నుంచి ప్రజల మధ్యే ఉంటూ వారి కష్టాలను దగ్గరగా చూశాను.

దమ్మపేట నవంబర్ 13 మీ వార్త ఆర్ సి వనమాల శ్రీనివాసరావు: దమ్మపేట పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ భావోద్వేగానికి గురయ్యారు. 2014 సంవత్సరం నుంచి ఎలాంటి పదవులు లేకపోయినా ప్రజల మధ్యనే ఉంటూ వారి కష్టసుఖాల్లో భాగస్వామిగా ఉన్నానని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ,భావోద్వేగానికి గురయ్యారు. ఆ సమయంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కళ్లారా చూశానని వారి కష్టాలను తీర్చడానికి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేదని గుర్తుచేసుకున్నారు. భగవంతుని దయతో నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదంతో ఎమ్మెల్యేగా గెలిచి ప్రజల సమస్యలను నేరుగా పరిష్కరించే అవకాశం కల్పించిన నియోజకవర్గ ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ వారి అవసరాలు తీర్చడానికి నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సామాన్య ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సన్నబియ్యం పంపిణీ గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ రూ.500కే గ్యాస్ సిలిండర్ మహిళా సాధికారత కోసం వారి ఆర్థిక స్వావలంబన కోసం స్వయం సహాయక సంఘాలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు తదితర పథకాలు పేద మధ్యతరగతి సామాన్య కుటుంబాలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని వివరించారు. ఈ సంక్షేమ పథకాలకు తోడుగా ఇప్పుడు నూతన పెన్షన్ల మంజూరు కార్యక్రమం కూడా చేరిందని అర్హులైన వృద్ధులు వితంతువులు ఒంటరి మహిళలకు పెన్షన్ల ద్వారా ఆర్థిక భరోసా కల్పించడం సంతోషకరమని అన్నారు కొత్త రేషన్ కార్డులు కొత్త పెన్షన్ల మంజూరు ద్వారా అర్హులైన పేద కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. తనకు పదవి ఉన్నా లేకపోయినా ప్రజా జీవితాన్ని ప్రజాసేవకే అంకితం చేస్తానని ప్రజల అవసరాలను గుర్తించి వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, భావోద్వేగంగా పేర్కొన్నారు. ప్రజల ఆశీర్వాదమే తనకు కొండంత బలమని వారి నమ్మకాన్ని ఎప్పటికీ వమ్ము చేయనని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల రెండో విడత పంపిణీ కార్యక్రమం రేపటి నుంచి మొదలవుతుందని నియోజకవర్గంలో ఉన్న ప్రతి గ్రామంలో పూరి గుడిసెలు లేకుండా చేస్తానని భావించారు. పేదలందరికీ అండగా నిలవాలని పార్టీలకతీతంగా విభేదాలకు తావు లేకుండా నిష్పక్షపాతంగా లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రవీందర్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కక్కిరాల రమేష్ , పగడాల రమాదేవి, రాంబాబు, రావు గంగాధర్ రావు, సొంగ యేసు మణి, పొదిలి జ్యోతి, వనమాల శ్రీనివాసరావు, మండలంలో సర్పంచ్లు ఉప సర్పంచ్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రాధాన్యత గురించి ప్రతి విద్యార్థి తెలుసుకోవాలి.





భద్రాచలం నవంబర్ 13 మన మీ వార్త: సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ. ప్రతి మనిషికి సమాజంలో గుర్తింపు ఉండడానికి ఓటు హక్కు తప్పనిసరి అని ఓటు లేకపోతే మనిషి బ్రతికి ఉన్న విలువ లేదని అటువంటి ఓటు విలువ ఓటు యొక్క ప్రాధాన్యత బాల్యం నుండే విద్యార్థులు తెలుసుకొని యుక్త వయసు రాగానే ఓటరు జాబితాలో తప్పనిసరిగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ విద్యార్థినీ విద్యార్థులకు సూచించారు. శుక్రవారం భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎన్నికల అక్షరాస్యత క్లబ్ ఆధ్వర్యంలో బాల బాలికలకు ఓటు హక్కు పై ప్రాధాన్యత అవగాహన కలిగించడానికి 119 భద్రాచలం నియోజకవర్గంలోని ఎన్నికల నమోదు కార్యాలయంలో వ్యాసరచన. క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి మృనాల్ శ్రేష్ఠ మాట్లాడుతూ.. ఓటు అనేది ప్రతి మనిషికి తప్పనిసరిగా ఉండాల్సిందేనని ఓటరు జాబితాలో పేరు లేకపోతే సమాజంలో ఎటువంటి విలువలు ప్రభుత్వం నుంచి రావలసిన సంక్షేమ పథకాలు వంటి ఆర్థిక ప్రయోజనాలు పొందడానికి అనార్హులవుతారని అందుకు ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకోవాలని అందుకు చిన్నారులు తప్పనిసరిగా ఓటు విలువ తెలుసుకొని ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించే ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసే విధంగా చేయాలని అన్నారు. అనంతరం ఓటు హక్కు ప్రాధాన్యత గురించి విద్యార్థిని విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన క్విజ్ పోటీలలో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ బహుమతులను అందించి ఓటు హక్కు ప్రాధాన్యత అవగాహన కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్నందుకు ఆయన విద్యార్థులను అభినందించారు.ఈ కార్యక్రమంలో డిఎల్పిఓ సుధీర్ డిప్యూటీ తహసీల్దార్(ఎలక్షన్స్) గోపాలకృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ వినయ శీలా శ్రీరామ్, భద్రాచలం ఎంఈఓ పద్మ ఉపాధ్యాయులు ,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల పెన్షన్, జీపీఎఫ్, సర్వీస్ సమస్యల సత్వర పరిష్కారానికి జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక వర్క్‌షాప్‌లు.

- అకౌంటెంట్ జనరల్ నావల్ కిషోర్.

- ఉమ్మడి జిల్లా పెన్షన్, జీపీఎఫ్ అదాలత్, వర్క్ షాప్ లో పాల్గొన్న అకౌంటెంట్ జనరల్.





ఖమ్మం నవంబర్ 13 మీ వార్త ప్రతినిధి: ఉద్యోగుల పెన్షన్, జీపీఎఫ్, సర్వీస్ సమస్యల సత్వర పరిష్కారానికి జిల్లాల వ్యాప్తంగా ప్రత్యేక వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నట్లు అకౌంటెంట్ జనరల్ వి.ఎం.వి. నావల్ కిషోర్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉద్యోగుల పెన్షన్, జీపీఎఫ్, ఇతర సర్వీస్ సంబంధిత అంశాలపై ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ కార్యాలయం నిర్వహించిన అదాలత్, వర్క్ షాప్ లో అకౌంటెంట్ జనరల్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి తో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా అకౌంటెంట్ జనరల్ నావల్ కిషోర్ మాట్లాడుతూ, ట్రెజరీ శాఖ ద్వారా అకౌంటెంట్ జనరల్ ఆఫీస్, ట్రెజరీల నుండి ఫైనాన్షియల్ అకౌంట్లు, ప్రొవిజన్ అకౌంట్లు, స్టేట్ గవర్నమెంట్ ఉద్యోగుల జీపీఎఫ్, పెన్షన్ ఆమోదించ బడతాయన్నారు. పెన్షన్ ఆమోదాలు డిస్బార్స్ చేయాలంటే, రాష్ట్ర ప్రభుత్వం అందించే సమాచారం, రికార్డులు ముఖ్యమని తెలిపారు. అకౌంట్లు, పెన్షన్ ప్రపోజల్స్, జీపీఎఫ్ అప్లికేషన్స్‌కు సంబంధించిన అన్ని అంశాలు సంబంధిత డీడీవో ఆఫీసుల ద్వారా వస్తాయని తెలిపారు. పనిని బాగా, ఎఫిషియెంట్‌గా చేయడానికి, అకౌంట్స్‌లో అక్యూరసీ, కరెక్ట్‌నెస్ ఉండాలని తెలిపారు. రిటైర్మెంట్ తర్వాత అప్లికేషన్స్ అన్నీ కరెక్ట్ ఫామ్‌లో, కరెక్ట్ టైమ్‌కి రావాలని, ఇది స్టేట్ గవర్నమెంట్ ఆఫీసులు, డీడీవోలు చేయాలని అన్నారు . ప్రభుత్వ ఉత్తర్వుల్లో ఇంటర్‌ప్రిటేషన్ అవసరమయ్యే రూల్స్ చాలా ఉంటాయని, వేర్వేరు ఆఫీసులు వాటిని వేర్వేరుగా ఇంటర్‌ప్రిట్ చేస్తుంటాయని తెలిపారు. వివిధ ఆఫీసుల నుండి వచ్చే వేర్వేరు ఇంటర్‌ప్రిటేషన్స్‌ను పరిశీలించి, ఏ ఇంటర్‌ప్రిటేషన్ తీసుకోవాలనే స్పష్టమైన డైరెక్షన్ ఇవ్వడానికి ఈ వర్క్‌షాప్ ప్రారంభించబడిందని వివరించారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని పెన్షనర్లకు మరింత మెరుగ్గా సహాయపడాలని, కొద్ది సంవత్సరాలలో అందరూ పెన్షనర్స్ అవుతారు కాబట్టి పెన్షనర్ల కోసం ఒక మంచి సిస్టమ్‌ను తయారు చేద్దామని సూచించారు. ట్రెజరీల పనితీరును మెరుగుపరచడానికి, అక్కడ జరిగే చిన్నపాటి పొరపాట్లను సరిదిద్దడానికి ట్రెజరీల తనిఖీ ఒక ముఖ్యమైన భాగమని తెలిపారు. ట్రెజరీల పనితీరును మెరుగుపరిచేందుకు ఆడిట్, తనిఖీల పారాలను అందించి, వాటికి తగినట్లుగా స్పందిస్తే అకౌంట్లు మరింత మెరుగవుతాయని అన్నారు. వర్క్‌షాప్‌లో భాగంగా ఉద్యోగుల, పెన్షనర్ల సమస్యలు అన్నీ అడ్రస్ చేసి, వాటికి ఫైండ్ అవుట్ రెసల్యూషన్ అందించడం జరుగుతుందని అన్నారు.డిస్ట్రిక్ట్ అడ్మినిస్ట్రేషన్, అందరు స్టేక్‌హోల్డర్స్ ఈ వర్క్‌షాప్ విజయవంతం కావడానికి తమ వంతు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ, సుదీర్ఘకాలం పాటు ప్రభుత్వ శాఖల్లో సేవనందించి పదవీ విరమణ పొందిన ఉద్యోగుల పట్ల పూర్తి గౌరవంతో వ్యవహరించాలని, వారి సమస్యలను సానుకూల దృక్పథంతో సత్వరం పరిష్కరించాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి అన్నారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ఉద్యోగుల పెన్షన్, జీపీఎఫ్, ఇతర సర్వీస్ సంబంధిత అంశాలు సాధారణంగా కొద్దిగా సంక్లిష్టంగా ఉంటాయని, వాటిని సులభతరం చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. నిన్నటి వరకు పదవుల్లో ఉన్న అధికారులను ఎలాగైతే గౌరవించామో, రిటైర్మెంట్ తర్వాత కూడా అదే గౌరవాన్ని ఇస్తూ వారిని చిన్నచూపు చూడకుండా చూడాల్సిన బాధ్యత మనపై ఉందని స్పష్టం చేశారు. కనీసం 20 నుండి 30-40 సంవత్సరాలు సుదీర్ఘ సేవ చేసి రిటైర్ అయిన తర్వాత, ఏ చిన్న సమస్య ఎదురైనా వారు ఇబ్బంది పడకుండా చూడాలని, వారిని స్వయంగా ఆహ్వానించి గైడెన్స్ ఇవ్వడం ద్వారా ఎంతో సంతోషపడతారని తెలిపారు.
తరచూ విడివిడిగా కరస్పాండెన్స్ చేయడం, మళ్లీ మళ్లీ ఆఫీసుల చుట్టూ తిరగడం వంటి ఇబ్బందులను నివారించడానికి జిల్లా వ్యాప్తంగా ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన ప్రత్యేక వర్క్‌షాప్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇలాంటి వర్క్‌షాప్‌ల ద్వారా సమస్యలను అక్కడికక్కడే అర్థం చేసుకొని, అక్కడికక్కడే పరిష్కార మార్గాలు చూపించడం వల్ల అధికారులకు, ఉద్యోగులకు కూడా సమయం ఆదా అవుతుందని అన్నారు .
చాలా సందర్భాలలో బిల్లుల ఆమోదంలో వివిధ రకాల ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఈ వర్క్‌షాప్‌ల ద్వారా బిల్లుల ఆమోద ప్రక్రియపై కూడా స్పష్టత ఇస్తే పనులు సులభమవుతాయని తెలిపారు. పాలసీ సంబంధిత అంశాలపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. చిన్న చిన్న ఇబ్బందులు, నిబంధనల ఇంటర్‌ప్రెటేషన్ సమస్యలను సరిగ్గా స్ట్రూటినైజ్ చేసుకోవడానికి ఈ వర్క్‌షాప్‌లు ఎంతగానో ఉపయోగపడతాయని, రేపు మనం కూడా రిటైర్ అయ్యాక ఇదే పరిస్థితి ఉంటుందని భావించి అధికారులందరూ దీనిని బాధ్యతగా తీసుకోవాలని కోరారు. డీడీఓ లు అందరూ ఈ వర్క్‌షాప్‌లకు పూర్తి శ్రద్ధ కనబరిచి, అన్ని విషయాలు అవగతం చేసుకుని సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ అన్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ లు ఎం. నరేష్ కుమార్, కె. శశిధర్, ఖమ్మం ట్రెజరీ డిప్యూటీ డైరెక్టర్ వై. శ్రీనివాస రెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం ట్రెజరీ డిప్యూటీ డైరెక్టర్ జె. మీనాక్షి,ఖమ్మం పిఎఓ రామ్, ఉభయ జిల్లాల వివిధ శాఖల జిల్లా అధికారులు, ఉప కోశాధికారులు మోదుగు వేలాద్రి, ప్రసన్న కుమార్, నాగేంద్ర కుమారి, శారదా, రఫియా సుల్తానా కృష్ణారావు, సారధి, సునీల్, శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, సైదులు, ఉమ్మడి ఖమ్మం జిల్లా ఖజానా కార్యాలయాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితురాలికి శ్రీ నృసింహ సేవా వాహిని ఆధ్వర్యంలో ఆర్థిక సాయం.



భద్రాచలం నవంబర్ 13 మన మీ వార్త: కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ వైద్య ఖర్చులు భరించలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న భద్రాచలానికి చెందిన అర్జునపూడి నవతకు శ్రీ నృసింహ సేవా వాహిని ఆర్థిక చేయూత అందించింది. శ్రీ గోవింద కల్పవృక్ష నారసింహ సాలగ్రామ ఆశ్రమ వ్యవస్థాపకులు కృష్ణ చైతన్య స్వామి ఆధ్వర్యంలో రూ.15,000 ఆర్థిక సహాయాన్ని నవతకు వైద్య చికిత్స నిమిత్తం అందజేశారు.ఈ సందర్భంగా బీజేపీ నాయకులు కుంజా సంతోష్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఆధ్యాత్మిక సేవలు అందిస్తూ, భక్తుల విశ్వాసాలకు అనుగుణంగా మార్గదర్శనం చేస్తున్న కృష్ణ చైతన్య స్వామి సేవలు అభినందనీయమని అన్నారు. సోషల్ మీడియా వేదికగా సమకాలీన ధర్మ సందేహాలకు సమాధానాలు అందిస్తూ ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందిస్తున్నారని పేర్కొన్నారు. మానవసేవే మాధవసేవ అనే నినాదాన్ని ఆచరణలో చూపిస్తూ, అనారోగ్యంతో బాధపడుతున్న నవతకు ఆర్థిక సహాయం అందించడం అభినందనీయమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో టీయుడబ్ల్యూజే భద్రాచలం పట్టణ అధ్యక్షులు విజ్జగిరి రాజా కిరణ్, హరిబాబు, భూక్యా సాయి కౌశిక్, రాజేష్, శేఖర్, డిపో యూత్ సభ్యులు పందా అమృతరావు తాళ్ల నాగరాజు, శీలం నాగరాజు, సవలం వంశీ, తాళ్ల శివ తదితరులు పాల్గొన్నారు.

సజ్జనార్ కు షాక్...

హైదరాబాద్ : తెలంగాణ పోలీసు శాఖలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సర్కార్ అనూహ్యమైన రీతిలో భారీ ప్రక్షాళనకు తెరలేపింది. ఒకేసారి 21 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జారీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ బదిలీల్లో అత్యంత ప్రధానంగా చెప్పుకోవాల్సిన అంశం హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్‌కు ఎదురైన భారీ షాక్. అత్యంత కీలకమైన ఫోకల్ పోస్టు లో కొనసాగుతున్న 1996 బ్యాచ్ అధికారి సజ్జనార్‌ను ఆ బాధ్యతల నుంచి తప్పించి, ప్రాధాన్యత తక్కువగా ఉండే తెలంగాణ ఫైర్, డిజాస్టర్ రెస్పాన్స్, ఎమర్జెన్సీ అండ్ సివిల్ డిఫెన్స్ డైరెక్టర్ జనర గా బదిలీ చేశారు. అదనంగా స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ బాధ్యతలు అప్పగించినప్పటికీ, సజ్జనార్ వంటి కీలక అధికారిని లూప్ లైన్ తరహా విభాగానికి పంపడం వెనుక ప్రభుత్వ అంతర్గత వ్యూహాలు బలంగా పనిచేశాయన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి.మరోవైపు, పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న 2001 బ్యాచ్ అధికారి అకున్ సబర్వాల్‌కు ప్రభుత్వం అత్యంత కీలకమైన పవర్‌ఫుల్ పోస్టింగ్ ఇచ్చి తన ప్రాధాన్యతను చాటుకుంది. అకున్ సబర్వాల్‌ను రాష్ట్ర శాంతిభద్రతల విభాగం అదనపు డీజీపీ గా నియమించడంతో పాటు, కోఆర్డినేషన్, టెక్నికల్ సర్వీసెస్ విభాగాల అదనపు బాధ్యతలను కూడా అప్పగించింది. ఇక సజ్జనార్ స్థానంలో కొత్త హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా 1995 బ్యాచ్ సీనియర్ ఐపీఎస్ అధికారి మహేష్ మురళీధర్ భగవత్ నియమితులయ్యారు. ఇప్పటివరకు శాంతిభద్రతల విభాగం డీజీపీగా పనిచేసిన ఆయన, గతంలో రాచకొండ కమిషనర్‌గా సుదీర్ఘకాలం పనిచేసిన అనుభవంతో ఇప్పుడు రాజధాని శాంతిభద్రతలను పర్యవేక్షించనున్నారు.ఈ ప్రక్షాళనలో భాగంగా అవినీతి నిరోధక శాఖ , నిఘా, ఆర్టీసీ, పౌరసరఫరాల విభాగాల్లోనూ ప్రభుత్వం కీలక మార్పులు చేసింది. సీనియర్ మహిళా ఐపీఎస్ అధికారిణి చారు సిన్హాను పూర్తిస్థాయి ఏసీబీ డీజీగా నియమిస్తూనే, సీఐడీ డీజీపీగా పూర్తి అదనపు బాధ్యతలు కొనసాగించింది. మల్టీజోన్-1 ఐజీగా ఉన్న ఎస్. చంద్రశేఖర్ రెడ్డిని ఏసీబీ డైరెక్టర్‌గా బదిలీ చేసింది. అలాగే గ్రేహౌండ్స్ ఆపరేషన్స్ డీజీపీగా ఉన్న డాక్టర్ అనిల్ కుమార్‌ను టీజీఎస్ఆర్టీసీ ఎండీగా నియమించగా, ఆర్టీసీ ఎండీగా ఉన్న వై. నాగిరెడ్డిని పౌరసరఫరాల శాఖ కమిషనర్‌గా మార్చింది.

LOSS OF ID CARD

ICICI Bank

This is to bring to the notice of the general public that the Original ICICI Bank Authorized Channel Partner ID Card bearing No. **2608845**, issued to **Mr. R. Shamsunder (57)** working with **Unicorn Consultants**, has been lost while travelling by bike within the limits of **KPHB Police Station** on **20th October 2026.**

A complaint has been lodged with KPHB Police Station regarding the loss of the said ID card.

Public are hereby advised

Anyone who finds the said ID card is requested to return it to the management **of Unicorn Consultants.**

ICICI Bank customers are further advised to remain alert and not to respond to any person who may use the lost ID card to ask for money or try to transact any business.

Unicorn Consultants and ICICI Bank will not be responsible for any transactions carried out using the lost ID card.

Unicorn Consultants
Hyderabad 500072

భారత్‌కు ఇంకా సంపూర్ణ ఆహార భద్రత లేదు!

న్యూఢిల్లీ: వ్యవసాయ రంగంలో భారత్ గణనీయమైన ప్రగతి సాధిస్తున్నప్పటికీ, ఆహార ఉత్పత్తుల సరఫరా విషయంలో ఇంకా సంపూర్ణ స్వయం సమృద్ధిని సాధించలేదని నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ అశోక్ కుమార్ లాహిరి అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా వంటనూనెల అవసరాల కోసం విదేశీ దిగుమతులపై ఎక్కువగా ఆధారపడటం దేశ ఆహార భద్రతకు సవాలుగా మారుతోందని పేర్కొన్నారు. భారత్ ప్రపంచంలోనే అత్యధికంగా వంటనూనెలను దిగుమతి చేసుకుంటున్న దేశమని గుర్తుచేశారు. శుక్రవారం ఢిల్లీలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో మాట్లాడిన ఆయన, ఆహార ఉత్పత్తుల విషయంలో దేశం ఎదుర్కొంటున్న సవాళ్లను వివరించారు.

వంటనూనెల దిగుమతులకే రూ.లక్షల కోట్ల వ్యయం

దేశీయంగా వంటనూనెల వినియోగం భారీగా ఉండటంతో అవసరాల్లో సగానికి పైగా దిగుమతుల ద్వారానే సమకూర్చుకోవాల్సి వస్తోందని లాహిరి తెలిపారు. ఏటా సుమారు 17 మిలియన్ మెట్రిక్ టన్నుల వంటనూనెలను విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నామని, ఇందుకోసం దాదాపు 20 బిలియన్ అమెరికన్ డాలర్లు వెచ్చిస్తున్నామని వెల్లడించారు. దేశీయంగా నూనెగింజల సాగు, ఉత్పత్తి పెంచాల్సిన అవసరాన్ని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయని అభిప్రాయపడ్డారు.

పప్పుధాన్యాల వినియోగంలో భారత్‌దే అగ్రస్థానం

పప్పుధాన్యాల ఉత్పత్తి, వినియోగంలో భారత్ ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉందని అశోక్ కుమార్ లాహిరి తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా వినియోగించే పప్పుధాన్యాల్లో దాదాపు నాలుగో వంతు భారత్‌లోనే వినియోగమవుతోందని పేర్కొన్నారు. దేశంలో ఏటా సుమారు 25 నుంచి 27 మిలియన్ టన్నుల పప్పుధాన్యాలను వినియోగిస్తున్నట్లు వివరించారు. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకోవాలంటే వ్యవసాయ రంగంలోనూ సమగ్ర అభివృద్ధి సాధించాలని, అందులో భాగంగా 'వికసిత్ కృషి'కి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఆహార ఉత్పత్తుల విషయంలో దేశం పూర్తిస్థాయి భద్రత సాధించిందా? అనే ప్రశ్నకు ప్రస్తుత పరిస్థితుల్లో లేదనే సమాధానం వస్తుందని వ్యాఖ్యానించారు.

విదేశాల నుంచి దిగుమతులపైనే ఆధారం

భారత్ పలు రకాల పప్పుధాన్యాలు, వంటనూనెల కోసం వివిధ దేశాలపై ఆధారపడుతోందని లాహిరి వివరించారు.

- శనగలు: ఆస్ట్రేలియా నుంచి దిగుమతి చేసుకుంటున్నాం.
- మసూర్ పప్పు: ఆస్ట్రేలియా, కెనడా నుంచి సరఫరా అవుతోంది.
- ఇతర పప్పుధాన్యాలు: మయన్మార్, ఆఫ్రికా, రష్యా నుంచి దిగుమతి అవుతున్నాయి.
- వంటనూనెలు: ఇండోనేషియా, మలేషియా, అర్జెంటీనా, బ్రెజిల్ తదితర దేశాల నుంచి వస్తున్నాయి.

దేశీయ అవసరాల కోసం విదేశాల నుంచి దిగుమతులు చేసుకోవడంలో తప్పేమీ లేదని, అయితే వాటిపై అతిగా ఆధారపడటం దీర్ఘకాలంలో సమస్యలకు దారితీయవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు.

అంతర్జాతీయ సంక్షోభాలు వస్తే ధరల భారం

ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలు, వాణిజ్య ఆంక్షలు, వాతావరణ మార్పులు, రవాణా సమస్యలు వంటి పరిణామాలు అంతర్జాతీయ ఆహార సరఫరా వ్యవస్థను ప్రభావితం చేసే అవకాశం ఉందని లాహిరి హెచ్చరించారు. దిగుమతి చేసుకునే దేశాల్లో ఉత్పత్తి తగ్గినా, అంతర్జాతీయ మార్కెట్లో ధరలు ఒక్కసారిగా పెరిగినా భారత్‌పై దాని ప్రభావం తప్పదని పేర్కొన్నారు. ముఖ్యంగా వంటనూనెలు, పప్పుధాన్యాల ధరలు పెరిగితే దేశీయ మార్కెట్లో వినియోగదారులపై అదనపు భారం పడే ప్రమాదం ఉందన్నారు. సరఫరాలో అంతరాయాలు ఏర్పడితే ఆహార భద్రతకు సవాళ్లు ఎదురవుతాయని వివరించారు.

స్వయం సమృద్ధి దిశగా వ్యవసాయానికి ప్రోత్సాహం అవసరం

దేశీయంగా నూనెగింజలు, పప్పుధాన్యాల సాగును విస్తరించడం, రైతులకు మెరుగైన విత్తనాలు, ఆధునిక సాగు పద్ధతులు అందించడం కీలకమని వ్యవసాయ రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. దిగుబడులను పెంచడంతో పాటు పంటల నిల్వ, ప్రాసెసింగ్, మార్కెటింగ్ సదుపాయాలను మెరుగుపరిస్తే దిగుమతులపై ఆధారపడటాన్ని క్రమంగా తగ్గించవచ్చు. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్న భారత్‌కు ఆహార భద్రత కూడా అత్యంత కీలకం. ఆహార ఉత్పత్తుల విషయంలో స్వయం సమృద్ధి సాధించినప్పుడే అంతర్జాతీయ పరిణామాలతో సంబంధం లేకుండా దేశీయ సరఫరా వ్యవస్థను స్థిరంగా ఉంచడం సాధ్యమవుతుంది.

'ఆపరేషన్ సిందూర్' ప్రైవేటు భద్రతా సిబ్బంది ప్రాధాన్యాన్ని చాటింది



దేశ రక్షణలో ప్రైవేటు భద్రతా సిబ్బంది కీలక పాత్ర పోషించాల్సిన అవసరాన్ని ఆపరేషన్ సిందూర్ నిరూపించిందని మాజీ ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది అన్నారు. వీరిలో ఎక్కువ మంది మాజీ సైనికులేనని, భవిష్యత్తులో జరిగే యుద్ధాల్లో సైన్యం, పోలీసు బలగాలతో పాటు వీరి పాత్ర కూడా అంతే ముఖ్యంగా ఉంటుందని పేర్కొన్నారు. ఢిల్లీలో శుక్రవారం సెంట్రల్ అసోసియేషన్ ఆఫ్ ప్రైవేట్ సెక్యూరిటీ ఇండస్ట్రీ (క్యాప్సీ) నిర్వహించిన 21వ వార్షిక భద్రతా నాయకత్వ సదస్సులో ఆయన మాట్లాడారు. దేశంలో కోటి మందికి పైగా ప్రైవేటు భద్రతా సిబ్బంది 35 వేలకుపైగా సంస్థల్లో పనిచేస్తున్నారని ద్వివేది తెలిపారు. సాధారణ ప్రజలకు భద్రత అంటే ముందుగా కనిపించేది సైన్యం, పోలీసుల కంటే అపార్ట్‌మెంట్ గేటు వద్ద, బ్యాంకు ప్రవేశ ద్వారం వద్ద, ఆసుపత్రుల వద్ద విధులు నిర్వహించే సిబ్బందేనని చెప్పారు. విద్యుత్ కేంద్రాలు, బొగ్గు గనులు, పరిశ్రమలు, డేటా సెంటర్లు, ఓడరేవుల వంటి కీలక రంగాల్లోనూ వీరు భద్రత కల్పిస్తున్నారని వివరించారు. దేశ భద్రత కేవలం నియంత్రణ రేఖ వద్దే నిర్ణయం కాదని, అర్ధరాత్రి విద్యుత్ కేంద్రం గేటు వద్ద కూడా అంతే కీలకమని వ్యాఖ్యానించారు. ఆపరేషన్ సిందూర్‌లో డ్రోన్లను అడ్డుకోవడంలో ఏ ఒక్క ఆయుధమో, సంస్థో పనిచేయలేదని ద్వివేది గుర్తుచేశారు. ఒక సంస్థ సెన్సర్లు, మరో సంస్థ జామర్లు, ఇంకొక సంస్థ తుపాకులు సమన్వయంతో పనిచేయడం వల్లే రక్షణ సాధ్యమైందన్నారు. అంతర్గత భద్రతలోనూ ఇలాంటి సమన్వయం అవసరమని చెప్పారు. ప్రైవేటు భద్రతా సిబ్బంది స్థానిక పోలీస్ స్టేషన్ల అధికారులతో సంబంధాలు ఏర్పరచుకోవాలని, అగ్నిమాపక, పౌర రక్షణ విభాగాలతో కలిసి కసరత్తులు నిర్వహించాలని సూచించారు. గార్డులు అందించే సమాచారాన్ని కూడా అధికారులు తీవ్రంగా పరిగణించాలని అన్నారు.

ప్రస్తుతం సంఘర్షణలు భౌతిక ప్రపంచంతో పాటు డిజిటల్ రంగం, ప్రజల ఆలోచనా విధానాల్లోనూ జరుగుతున్నాయని ద్వివేది హెచ్చరించారు. వదంతులు, తీవ్రవాద భావజాలానికి లోనైన వ్యక్తులు, సంస్థల్లోని సమాచార భద్రతా లోపాలు కూడా ముప్పుగా మారవచ్చని పేర్కొన్నారు. శిక్షణ పొందిన, సమన్వయంతో పనిచేసే కోటి మంది భద్రతా సిబ్బంది దేశానికి వ్యూహాత్మక బలమని, గుర్తింపు, శిక్షణ లేకపోతే అదే బలహీనతగా మారుతుందని అన్నారు.

అనుభవానికి గుర్తింపు.. నైపుణ్యాలకు ధ్రువీకరణ

15 ఏళ్ల అనుభవం ఉన్న భద్రతా సిబ్బందికి అగ్నిప్రమాదాలు, జనసమూహాల నియంత్రణ, దొంగతనాలు, వైద్య అత్యవసర పరిస్థితులను ఎదుర్కొన్న అనుభవం ఉన్నప్పటికీ, పత్రాల్లో నైపుణ్యం లేని వారిగా పేర్కొనడం అన్యాయమని ద్వివేది అన్నారు. మాజీ సైనికుల గత అనుభవానికి గుర్తింపు ఇవ్వడంతో పాటు, వారి సామర్థ్యాలకు అధికారిక ధ్రువీకరణ కల్పించడంపై సదస్సు దృష్టి పెట్టిందని వివరించారు.

గార్డింగ్ ఆఫీసర్ కార్యక్రమం ద్వారా భద్రతా సిబ్బందికి కొత్త హోదా కల్పించే ప్రయత్నాన్ని ఆయన ప్రస్తావించారు. దీనికి సెప్టెంబరులో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్ఓసీ) లభించినట్లు తనకు తెలిసిందన్నారు. శిక్షణ, అంచనా, ధ్రువీకరణ కోసం రాష్ట్రీయ రక్షా యూనివర్సిటీతో క్యాప్సీ కుదుర్చుకున్న ఒప్పందాన్ని అభినందించారు. అయితే కొత్త హోదా కేవలం పేరుకే పరిమితం కాకుండా, ధ్రువీకరించిన నైపుణ్యం, స్పష్టమైన బాధ్యతలు, గార్డు స్థాయి నుంచి సూపర్‌వైజర్, మేనేజర్ స్థాయికి ఎదిగే అవకాశాలు ఉండాలని సూచించారు. ప్రైవేటు భద్రతా సంస్థల నియంత్రణ చట్టం (పీఎస్ఏఆర్ఏ) కింద లైసెన్సుల జారీ ప్రక్రియను మరింత సరళంగా, వేగంగా మార్చాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

బడుగు బలహీన వర్గాల కోసం ఆలోచించే ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం.

- ఎమ్మెల్యే కోరం కనకయ్య.
- ఇల్లందు నియోజకవర్గంలో 3971 నూతన పెన్షన్లు మంజూరు.



ఇల్లందు నవంబర్ 13 మీ వార్త ప్రతినిధి: బడుగు బలహీన వర్గాల కోసం ఆలోచించే ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. పేదవాడి కష్టం తెలిసిన ప్రభుత్వం కాబట్టే చేయూత పెన్షన్ల ద్వారా ఆసరా కల్పిస్తోందని చెప్పారు.శుక్రవారం ఇల్లందు ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన చేయూత నూతన పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు పెన్షన్ మంజూరు పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇల్లందు నియోజకవర్గంలో మొత్తం 3971 నూతన పెన్షన్లు మంజూరయ్యాయని తెలిపారు. అందులో ఇల్లందు మండలంలో 846, ఇల్లందు పట్టణంలో 349 పెన్షన్లు మంజూరయ్యాయని వివరించారు. మిగిలిన మండలాల్లో కూడా విడతల వారీగా పెన్షన్లు పంపిణీ చేస్తామని చెప్పారు.వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, బీడీ కార్మికులు, చేనేత కార్మికులు తదితర బడుగు బలహీన వర్గాలకు పెన్షన్ ఎంతో ఆసరాగా ఉంటుందన్నారు. వయసు మళ్లిన తర్వాత ఎవరి మీద ఆధారపడకుండా గౌరవంగా జీవించడానికి ఈ పెన్షన్ డబ్బులు ఉపయోగపడతాయని అన్నారు.గత ప్రభుత్వం పెన్షన్ల కోసం ఎదురుచూసే పరిస్థితి తెచ్చిందని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే తెలిపారు. అర్హత ఉండి ఇంకా ఎవరికైనా పెన్షన్ రాకపోతే దరఖాస్తు చేసుకోవాలని, వారికి కూడా పెన్షన్ వచ్చేలా చూస్తామని హామీ ఇచ్చారు.పెన్షన్ తో పాటు రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, రుణమాఫీ, మహాలక్ష్మి పథకం వంటి సంక్షేమ పథకాల ద్వారా పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దొడ్డ కిరణ్ మిత్ర, వైస్ చైర్మన్ రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ బానోతు రాంబాబు, స్పెషల్ ఆఫీసర్ రవి, ఎంపీడీవో ధన్ సింగ్ , మున్సిపల్ కమిషనర్ ఎస్. సందీప్, మండల అధికారులు, కౌన్సిలర్లు, సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి 125 రోజులు పని కల్పించాలి.

- రోజుకి రూ.308 వేతనం పొందే విధంగా వారితో పనులు చేయించాలి.
- బాధ్యతగా పనిచేసి నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించాలి.
- ఎల్ నినో ప్రభావం దృష్ట్యా నీరు వృధా కాకుండా చూడాలి.
- మేట్ల వృత్యంతర శిక్షణా కార్యక్రమంలో ఎంపీడీవో
- సోంలాల్, ఏపీవో శ్రీ రాణి.





కామేపల్లి నవంబర్ 13 మీ వార్త ప్రతినిధి: బాధ్యతగా పనిచేసి నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించి ఆదర్శంగా నిలవాలని ఎంపీడీవో ధరావత్ సోంలాల్, ఏపీవో అద్దంకి శ్రీ రాణి,ఈసీ దామాల వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. కామేపల్లి రైతు వేదికలో విబిజీ రాంజీ పథకం,చట్టం అమలు, విధులు,బాధ్యతలపై మేట్లకు శుక్రవారం నిర్వహించిన వృత్యంతర శిక్షణ కార్యక్రమంలో వారు పాల్గొని ప్రసంగించారు. కూలీల భాగస్వామ్యాన్ని మరింతగా పెంచాలన్నారు. జాబు కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ నిబంధనల మేరకు 125 రోజులు పని కల్పించాలని, ప్రతి కూలి రోజు రూ.308 వేతనం పొందే విధంగా వారితో పనులు చేపించాలని కోరారు.పనికి ముందు, పని అనంతరం వారి ఫోటోలను తీసుకోవాలని కోరారు. ఎలినినో ప్రభావం దృష్ట్యా నీటి వృధాను నియంత్రించా లని కోరారు. జాబ్ కార్డుదారులకు చేతినిండా పని కల్పించి ఆదుకోవడం జరుగుతుందన్నారు. ఎల్ నినో ప్రభావం దృష్ట్యా వీబీజీ రాంజీ పథకమును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ ఓరియంటేషన్ కార్యక్రమం లో ముచ్చర్ల సర్పంచ్ జాటోత్ జాయ్ లూసి, పంచాయతీ కార్యదర్శులు అనిత, విక్రమ్,టెక్నికల్ అసిస్టెంట్లు భాస్కర్, బావ్ సింగ్, కుమార్, సుప్రియ, ఫీల్డ్ అసిస్టెంట్లు, సి ఓ శ్రీనివాస్,మండల పరిధిలోని మేట్లు తదితరులు పాల్గొన్నారు. తొలుత మ్యాపులను వేసి మ్యాపులు ఆధారంగా నీటి కుంటలు, పంట కుంటలు, ఇంకుడు గుంతలు తదితర అంశాలపై ప్రత్యక్ష పద్ధతిలో అవగాహన కల్పించారు.

రైతుల కోసం కస్టమైజింగ్ సెంటర్.

- అద్దె ప్రాతిపదికన ఆధునిక వ్యవసాయ యంత్రాలు.
- ఎఫ్‌పీవో, మహిళా సంఘాలు ప్యాక్స్‌లకు అవకాశం.
- కామేపల్లి ఏవో బి.తారా దేవి.



కామేపల్లి నవంబర్ 13 మీ వార్త ప్రతినిధి: కామేపల్లి మండలానికి వ్యవసాయ యాంత్రికరణ పథకంలో భాగంగా కస్టమర్ హైరింగ్ సెంటర్ (సి.హెచ్.సి) యూనిట్ ను కేటాయించడం జరిగిందని మండల వ్యవసాయ అధికారి భూక్య తారా దేవి శుక్రవారం తెలిపారు. ఆసక్తి గల రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, ప్రాథమిక సహకార సంఘాలు, స్వయం సహాయక సంఘాల వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. రైతుల కోసం కస్టమైజింగ్ సెంటర్ ను మంజూరు చేయడం జరిగిందని తెలిపారు.అద్దె ప్రాతిపదికన ఆధునిక వ్యవసాయ యంత్రాలు ఎఫ్‌పీవో, మహిళా సంఘాలు, ప్యాక్స్‌లకు అవకాశం ఉంటుందన్నారు. రైతులకు వ్యవసాయ యంత్రాలు కొనుగోలు చేయడం ఆర్థిక భారంగా మారిందని యంత్రాలు అందుబాటులో లేక కూలీల పని పెరిగి సాగు ఖర్చులు పెరుగుతున్నాయ ని తెలిపారు.రైతులకు ఆధునిక వ్యవసాయ యంత్రాలు వినియోగిం చేందుకు కస్టమైజింగ్ సెంటర్ల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని వ్యవసాయ రంగంలో యాంత్రీకరణను ప్రోత్సహించడం ద్వారా రైతుల శ్రమను తగ్గించాలని కేంద్ర ప్రభుత్వం స్మామ్ (ఎస్ఎంఏఎం) పథకాన్ని తీసుకువచ్చిందని తెలిపారు. ఈ పథకంలో భాగంగా కస్టమైజింగ్ సెంటర్ ద్వారా సన్న, చిన్న కారు రైతులకు ఆధునిక వ్యవసాయ యంత్రాలను అందుబాటులోకి తీసుకువస్తోందని, ఎఫ్‌పీవో, మహిళా సంఘాలు, ప్రాథమిక సహకార సంఘాలకు 40 శాతం సబ్సిడీపై కస్టమైజింగ్ సెంటర్ ఏర్పాటుకు అవకాశం కల్పిస్తూ రాష్ట్ర వ్యవసాయశాఖ మార్గదర్శకాలను జారీ చేసిందని వివరించారు. వ్యవసాయ యంత్రాలను సంఘాలు కొనుగోలు చేసి అద్దె ప్రాతిపదికన రైతులకు అందజేసేందుకు ఈ కస్టమైజింగ్ సెంటర్లు ఉపయోగపడతాయని, పత్తి, మొక్కజొన్న, వరితోపాటు ఇతర పంటల్లో భూమి చదును చేసే ప్రక్రియ నుంచి కోత వరకు అవసరమయ్యే యంత్రాలు ఈ సెంటర్లలో రైతులకు అందుబాటులో ఉంటాయని తెలిపారు. దరఖాస్తులు... అర్హతలు.. ఈ పథకం కింద కస్టమైజింగ్ సెంటర్ ఏర్పాటుకు ఎఫ్‌పీవోలు (రైతు ఉత్పత్తిదారుల సంఘాలు), ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, మహిళా స్వయం సహాయ సంఘాలు అర్హత కలిగి ఉంటాయి.ఈ సంఘాలు కనీసం మూడు సంవత్సరాలుగా పని చేస్తూ పొదుపు నిర్వహిస్తూ లావాదేవీలు కలిగి ఉండాలి.వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద ఇప్పటికే లబ్ధి పొందిన సంఘాలకు అర్హత లేదు. గరిష్ఠంగా ఒక హైరింగ్ సెంటర్‌కు ప్రాజెక్టు వ్యయం 50 లక్షలు ఉండగా అందులో 40 శాతం లేదా 20 లక్షల వరకు సబ్సిడీ అందుతుంది.కిసాన్ డ్రోన్ కస్టమ్ హైరింగ్ సెంటర్ కు 50 శాతం లేదా 5 లక్షల వరకు సబ్సిడీని అందజేస్తారు. సబ్సిడీ పోనూ మిగతా సొమ్మును సంఘాలు సొంత నిధి లేదా బ్యాంకు నుంచి రుణం పొందవచ్చు.అర్హత ఉన్న సంఘాలు తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో agrimachinary.nic.in లో దరఖాస్తు చేసుకోవాలి. యంత్రాలు... పరికరాలు... కస్టమైజింగ్ సెంటర్ లో అనేక వ్యవసాయ యంత్రాలు, పరికరాలు అందుబాటులో ఉండనున్నాయి.పవర్ టిల్లర్, కంబైండ్ హార్వెస్టర్, ఎలక్ట్రిక్ పీలర్, డిస్క్ ప్లౌ, కల్టివేటర్, లెవలర్, సీడ్, ఎరువుల డ్రిల్, మల్టి క్రాప్ ప్లాంటర్, రైస్ బెడ్ ప్లాంటర్, రోటరీ వీడర్, పవర్ వీడర్, బ్రష్ కట్టర్, ఇంటర్ కల్టివేటర్, న్యాప్‌సాక్ స్ప్రేయర్, పవర్ స్ప్రేయర్, ట్రాక్టర్ మౌంటెడ్ బూమ్స్ స్ప్రేయర్, కిసాన్ డ్రోన్, మల్టీ క్రాప్ థ్రెషర్, ఫ్యాన్, మేజ్ షెల్లర్, ప్లాస్టిక్ మల్చింగ్ లేయింగ్ మిషన్, స్ట్రా బేలర్, స్ట్రా ష్రెడర్, మోటార్ స్టాంపర్.

రైతులకు ప్రయోజనాలు...

కస్టమైజింగ్ సెంటర్ ఏర్పాటుతో చిన్న రైతులకు అనేక ప్రయోజనాలు కలగనున్నాయి.ఖరీదైన వ్యవసాయ యంత్రాలను కొనుగోలు చేయాల్సిన అవసరం లేదు.ఆధునిక యంత్రాలు అద్దెకు అందుబాటులోకి వస్తాయి. సాగు పనులను సకాలంలో పూర్తి చేసుకోవచ్చు. కూలీల కొరతను అధిగమించవచ్చు. పెట్టుబడి ఖర్చులను తగ్గించుకోవచ్చు. విత్తనాలు, ఎరువుల వినియోగం, కలుపు నివారణ, పంటల సంరక్షణ, పంట కోతలకు యంత్రాలు అందుబాటులో ఉంటాయి. ఎఫ్‌పీవోలు, సహకార సంఘాలు, మహిళా గ్రూపులకు ఈ కస్టమ్ హైరింగ్ సెంటర్ల నిర్వహణతో రైతుల నుంచి వచ్చే అద్దె ద్వారా అదనపు ఆదాయం సమకూరుతుం ది.ఈ హైరింగ్ సెంటర్ ను వ్యవసాయశాఖ ఎంపిక, పర్యవేక్షణ చేస్తుందని ఏవో తారా దేవి వెల్లడించారు.

ట్రాఫిక్ ఉల్లంఘనలకు రూ.311 కోట్ల జరిమానాలు!

తొమ్మిది నెలల్లో హైదరాబాద్ వాహనదారులపై భారీగా చలాన్లు

- కుల్సుంపుర పరిధిలో అత్యధికంగా రూ.22 కోట్లు
- సైదాబాద్ పరిధిలో అత్యల్పంగా రూ.4 కోట్లు
- జరిమానాలు విధిస్తున్నా మారని కొందరి వాహనదారుల తీరు

హైదరాబాద్: నగరంలో ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలు ఆందోళన కలిగిస్తున్నాయి. కేవలం తొమ్మిది నెలల వ్యవధిలోనే ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులపై మొత్తం రూ.311 కోట్ల జరిమానాలు విధించినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అయినప్పటికీ కొందరు వాహనదారుల్లో మార్పు కనిపించడం లేదు. హెల్మెట్, సీట్‌బెల్ట్ లేకుండా ప్రయాణించడం, అతివేగం, రాంగ్ రూట్‌లో వెళ్లడం వంటి ఉల్లంఘనలు కొనసాగుతుండటంతో ప్రమాదాల ముప్పు పెరుగుతోంది. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన జరిమానాల్లో కుల్సుంపుర అగ్రస్థానంలో ఉంది. ఈ ప్రాంతంలో తొమ్మిది నెలల్లో సుమారు రూ.22 కోట్ల జరిమానాలు విధించారు. సైదాబాద్ పరిధిలో అత్యల్పంగా రూ.4 కోట్ల జరిమానాలు నమోదయ్యాయి. నగరంలోని అబిడ్స్, ఆసిఫ్‌నగర్, గుడిమల్కాపూర్, అత్తాపూర్, చిలకలగూడ, బంజారాహిల్స్ తదితర ప్రాంతాల్లోనూ పెద్ద సంఖ్యలో ట్రాఫిక్ ఉల్లంఘనలు నమోదవుతున్నట్లు సమాచారం.